


సాగు.. పెరిగింది

● గత ఐదేళ్లతో పోలిస్తే అధికం
● 5.96 లక్షల ఎకరాల్లో వ్యవసాయం

● అంచనాలకు మించి వరి, పొగాకు, మొక్కజొన్న
● మిర్చి, వరికి నీటిని సరఫరా చేయాలంటోన్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రబీ సీజన్‌లో సాగు ఆశాజన కంగా ఉంది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది సాగు గణనీయంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణంలో 94 శాతం పంటలు సాగు చేయడం విశేషం. నీటి సరఫరా మెరుగ్గా ఉండటంతో సాగు పెరిగింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 5.96 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంచనా లకు మించి వరి, మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. రబీలో వరి తర్వాత మొక్కజొన్న ప్రధాన పంట కాగా ఈ ఏడు సాగు భారీగా పెరిగింది. వరి సాగు కూడా రెండేళ్ల కంటే పెరిగింది. అంచనాలను తలకిందులు చేస్తూ పొగాకు సాగు చేపట్టారు. వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు ఉంటే 1,39,227 ఎకరాల్లో సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 55 శాతం అధికంగా మొక్కజొన్న సాగైంది. పల్నాడు జిల్లాలో విస్తృతంగా కంది సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 6,662 ఎకరాలు కాగా 8,292 ఎకరాల్లో సాగు చేశారు. సాధారణం కన్నా 24 శాతం పెరిగింది.


మొక్కజొన్న


పొగాకు


వరి

తగ్గిన శనగ.. పెరిగిన పొగాకు

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో శనగ సాగు గణనీయంగా తగ్గింది. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కన్నా 35 శాతం, బాపట్ల జిల్లాలో 47 శాతం తగ్గింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,23,970 ఎకరాలు కాగా 76,022 ఎకరాల్లో మాత్రమే ఈ సారి రైతులు సాగు చేశారు. శనగకు ప్రత్యామ్నాయంగా పొగాకు చేశారు. దీంతో పొగాకు సాగు పెద్దఎత్తున పెరిగింది. పొగాకు 28,812 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 90,502 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 61,690 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. సాధారణం కన్నా మూడు రెట్లకు పైగా పొగాకు సాగు పెరగడం గమనార్హం.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	1,30,157	1,25,125	96
గుంటూరు	1,64,320	1,60,217	97
బాపట్ల	3,51,725	3,11,470	89

ఆశాజనకంగా సాగు..

పంటల సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. శనగ పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. పొగాకు కోత కొత దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నాట్లు పూర్తయ్యాయి. పొగాకు ధర కూడా ఆశాజన కంగా ఉందని రైతులు చెబుతున్నారు.

సాగర్ జలాశయంలో 191.25 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 191.25 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 541.3 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రేమానుబంధం



ప్రేమ.. రెండక్షరాల పదం.. కానీ దాని ప్రభావం అనంతం! సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు.. ప్రేమ చుట్టూ ప్రపంచం మొత్తం తిరుగుతోందంటే.. ప్రేమ మహత్తు గురించి ఇంకేం చెప్పాలి? రెండు హృదయాలను ఒక్కటి చేసే తీయని మకరందం.. ప్రేమ. రెండు జీవితాలను ఏకం చేసే అనుబంధమిది. మనిషికి మనసుతో వేసిన తియ్యటి అనుబంధం.. మనుగడకి మూలం.. ప్రేమామృతం. పిరికి వాడికి ధైర్యాన్నిస్తుంది.. ధైర్యవంతుడికి బలాన్నిస్తుందీ ప్రేమ. అలాంటి మధుర భావన స్పృశించని హృదయం ఉండదంటే ఆశ్చర్యం కాకపోవచ్చు. భాష, ప్రాంతం, ఏదైనా.. ప్రేమ భావం మాత్రం మారదు. సృష్టిపై ప్రభావమూ మారదు. కులమతాలు ఏవైనా.. దీని అభిమతం మాత్రం ఒక్కటే. ఎవరు ఔనన్నా.. కాదన్నా.. ఈ ప్రేమ తత్వం మాత్రం శాశ్వతం. ఆ ప్రేమను గురించి.. వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

గుంటూరు, బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సకల చరాచర సృష్టిని నడిపించేది ప్రేమ ఒక్కటే. చెట్లూ, చేమలు, పశుపక్ష్యాదులు, జీవరాశి ఏదైనా సరే ప్రేమ మాధుర్యాన్ని చవిచూడాల్సిందే. అయితే వాటికి లేని అదృష్టం.. మనిషికి మాత్రమే దక్కిన అదృష్టం.. ఆ ప్రేమను వ్యక్తం చేయడం. ఇతరులపై కలిగిన అభిమానాన్ని.. ఏర్పడిన ఇష్టాన్ని చెప్పే అవకాశం ఒక్క మనిషికి మాత్రమే దక్కింది. ఆ అభిమా నాన్ని.. ఇష్టాన్ని మహోన్నతమైన ప్రేమగా మలు చుకునే అవకాశం మనకు మాత్రమే ఉంది. కొత్త బంగారులోకంలో ప్రవేశించే యువతీ- యువకుల మధ్య జనించే ప్రేమ మధుర్యం ఇంతని చెప్పలేము. ఆ మాధుర్యం కలకాలం కొనసాగించడమే యువత ముందున్న సవాలు. ప్రేమించుకునే సమయంలో ఏర్పడే అభిమానాలు, ఇష్టాలు, ప్రేమలు జీవితకాలం కొనసాగించడమే అసలైన ప్రేమ. అలాంటి ప్రేమను సొంతం చేసుకోవడమే యువతకు సవాలు. ఆ సవాలును ఎదుర్కోవాలంటే యువతీ యువకులకు ఎంతో చైతన్యం కావాలి.

● బాహ్య సౌందర్యమే ప్రేమా?

ప్రపంచాన్నేలే ప్రేమ గెలవాలంటే.. నిలవాలంటే.. ప్రేమంటే ఏమిటో తెలియాలి. యుక్తవయసులో ఏర్పడే ఆకర్షణనే నేటి యువత ప్రేమగా భ్రమిస్తోంది. ఒకరంటే.. ఒకరికి ఏమిటో తెలియకుండానే.. అలవాట్లు.. జీవన విధానాలు.. తెలియ కుండానే.. బాహ్య సౌందర్యాన్ని చూసి ఆకర్షణలో పడిపోతున్నారు. ఎదుటివారి అంతఃసౌందర్యాన్ని వీక్షించకుండానే, హృదయ సౌందర్యాన్ని అనుభూతి చెందకుండానే ప్రేమలో పడిపోతున్నారు. అందుకే చిరకాలం నిలవాల్సిన ప్రేమ బంధాలు, అచిరకాలంలోనే అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రేమంటే ఒకరి పట్ల ఒకరికి నమ్మకం. బాధ్యత. సహనం. క్షమ. నిజాయితీ. పట్టుదల ఉండాలి. మనోబలం ఉండాలి. కుటుంబ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించే ధైర్యం, ఓపిక ఉండాలి. ఒకరి గౌరవాన్ని ఒకరు పెంచుకుంటూ ముందుకు సాగాలి. అయితే ఇలాంటి నిష్కల్మషమైన, నిర్మలమైన, నిస్వార్థమైన ప్రేమ ఉంటే అది కలకాలం నిలుస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా గెలుస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ యువతీ యువకుల మధ్య అలాంటి ప్రేమ కొరవడుతోంది.

సినిమా ప్రేమల వలలో.. యువత

సమాజంలో ప్రేమపై చాలా మందిలో సరైన అవగాహన లేదు. ప్రేమ అనగానే తల్లిదండ్రులు- బిడ్డలు పరస్పర

(మిగతా 8వ పేజీలో)

మారుతున్న ప్రేమ గమనం

కాలం మారినా.. తత్వం మార్చుకోని ప్రేమ.. తన గమనాన్ని మాత్రం మార్చుకుంటోంది. ఒకప్పటి ప్రేమకు పెళ్లి గమ్యమైతే.. నేటి ప్రేమ.. సహజీవనం చాలంటోంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాన్ని కోరుకున్న ఈ ప్రేమ.. నేడు ఒకరికి ఒకరం చాలంటోంది. పిల్లలూ వద్దంటోంది. పంచేకొద్దీ పెరిగే ఈ ప్రేమ.. అసలు పంచనే వద్దంటోంది. బాంధవ్యాలను తెంచేస్తోంది. అన్నీ అనుకూలించినా ప్రేమ అంతిమ గమ్యం పెళ్లి కాదనే ప్రమాద కర ధోరణులు గడచిన దశాబ్దాకాలంలో ఎక్కువైంది. ప్రేమ విషయంలో మారుతున్న యువత ఆలోచనా తీరు ఈ విధంగా ఉంటే ఈ సోషల్ మీడియా యుగంలో ప్రేమ పేరుతో బెదిరింపులు, ఎమోషనల్ బ్లాక్ మెయిల్స్, ఫొటో మార్ఫింగ్‌లు ఇవన్నీ ఆ మధురానుబంధానికి మరింతగా సవాళ్లు విసురుతున్నాయి.

6 బ్లాక్ మార్కెట్లో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు ● రెండు నెలలుగా తీవ్ర కొరత
కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు ● ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
మిర్చి ధర తగ్గిస్తే లైసెన్సు రద్దు ● మార్కెటింగ్ కమిషనర్ హెచ్చరిక

విద్యాజ్యోతిలో... అవినీతి



◆ జడ్పీ టెండర్ నిబంధనలకు నీళ్లు ◆ ఒకే తరహా పుస్తకానికి ఇద్దరు కాంట్రాక్టర్లు ◆ కమీషన్లతో నాసిరకం పేపర్‌తో మెటీరియల్ ముద్రణ ◆ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధం ◆ అధికారుల తీరుతోనే విద్యార్థులకు మెటీరియల్ పంపిణీలో జాప్యం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో అవినీతి కంపు కొడుతోంది. అధికారులు పూర్తిగా అడ్డదారులు తొక్కుతున్నారు. చివరకు పేద విద్యార్థులకు పంపిణీ చేసే విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను కూడా ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అందుకోసం టెండర్ నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలారు. కవర్ పేజీకి ఒక రేటు.. లోపలి పేజీకి మరో రేటు అంటూ అవినీతికి లాకులు తెరిచారు. అధికారులే అందినకాడికి పుచ్చుకోవడంతో నాణ్యత లేని పేపర్‌తో మెటీరియల్‌ను కాంట్రాక్టర్ ముద్రించారన్న ఆరోపణలున్నాయి. విద్యాజ్యోతి పుస్తకం ముద్రణ, టెండర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొంతమంది జడ్పీటీసీలు సిద్ధమయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఏటా విద్యాజ్యోతి పేరుతో స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఇందుకోసం జడ్పీ నిధులను రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వెచ్చిస్తుంటారు. ఈ ఏడాది కూడా విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. అన్ని జడ్పీ పాఠశాలల్లో సుమారు 34 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ ఇచ్చిన సమాచారంతో టెండర్ ప్రక్రియకు వెళ్లారు.



రేటు తక్కువ అని...

గతంలో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌కు ఇప్పటి మెటీరియల్‌కు చాలా తేడా ఉంది. గతంలో పేజీకి 33 పైసలు చొప్పున చెల్లించి నాణ్యమైన పేపర్‌తో పుస్తకాలు ముద్రించేలా చూసే వారు. ఇప్పుడు పేజీ 31 పైసలకు కాంట్రాక్టు ఇచ్చి నిధులు ఆదా చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ పూర్తి నాసిరకం కలిగిన పేపర్‌తో ప్రింట్ చేశారు. తక్కువ గేజ్ కలిగిన పేపర్ వాడటంతో మెటీరియల్ చూడడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. పేజీ రేటు తగ్గించి కాంట్రాక్టు ఒకే చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే పేజీ రేటు తగ్గించి కమీషన్ల పెంచడంతో పుస్తకం నాసిరకంగా మారిందన్న ఆరోపణలున్నాయి. కవర్ పేజీకి ఒక రకమైన కమీషన్, లోపలి పేజీలకు మరో రకమైన కమీషన్ ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. కమీషన్ల సంగతి తేలకపోవడంతోనే విద్యాజ్యోతి ఫైల్ నెల రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల తీరు వల్ల ఎప్పుడూ డిసెంబరులోనే విద్యార్థులకు అందే స్టడీ మెటీరియల్ ఈ ఏడాది ఫిబ్రవరి 8 వ తర్వాత పాఠశాలలకు చేరింది.

టెండర్లు పిలవాల్సింది ఎవరు?

పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్‌కు సంబంధించిన అన్ని టెండర్లు జడ్పీ డిప్యూటీ సీఈవో పిలవాలి. ప్రతిసారి ఆ విధంగానే జరుగుతుంది. అయితే జడ్పీ డ్రాయింగ్ అధికారి ఇవ్వాల్సిన టెండర్‌ను ఈ ఏడు మాత్రం మరొకరి పేరుతో జారీచేశారు. పుస్తకాల ముద్రణ బాధ్యతను ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించడం వివాదంగా మారింది. ఎప్పుడూ ఒకరికి మాత్రమే కాంట్రాక్టును అప్పగించేవారు. ఈసారి పట్టుబట్టి మరీ వేరే జిల్లా నుంచి మరో కాంట్రాక్టర్‌ను బరిలోకి దింపారు. ఎప్పుడూ పుస్తకాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ గతంలో కమీషన్ సరిగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టును రెండు భాగాలుగా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

రూ. 4 కోట్ల నిధులకు రెక్కలు..

జడ్పీలో మరో వివాదం తలెత్తింది. ప్రభుత్వం తాజాగా కేటాయించిన 15వ ఆర్థిక సంఘం పనుల కేటాయింపులో చేతి వాటం మొదలైందన్న ఆరోపణలున్నాయి. రూ.4 కోట్ల వ్యవహారంలో నిబంధనలను మీరి ఒకరికి బదులు మరొకరు పనుల కేటాయింపునకు పూనుకుంటున్నారు. కనీసం రెండు శాతం తగ్గకుండా కమీషన్ ఇచ్చిన వారికే పనులు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా ఫిర్యాదుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధమయ్యారని సమాచారం.

పట్టభద్రుల బరిలో 25 మంది

ఐదుగురు నామినేషన్ల ఉపసంహరణ
బ్యాలెట్ పేపర్ ముద్రణకు ఆర్‌వో ఆదేశాలు
ఎమ్మెల్సీ ఎన్నికలకు తుది ఓటర్ల సంఖ్య 3,47,116

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా -గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల లోపు ఐదురుగు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మేరిగ మోహన్‌రావు, బోట్ల శివసత్యన్నారాయణ, మంత్రి బాలకృష్ణ, డేగల సైదారాజు, గుడిశ రాంబాబు తమ మద్దతుదారులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి ఆర్‌వో నాగలక్ష్మిని కలిసి నామినేషన్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఫారాలను అందజేశారు. అనంతరం ఎన్నికల తుదిపోరులో నిలిచిన 25 మంది అభ్యర్థుల జాబితాను ఆర్‌వో విడుదల చేశారు. అనంతరం బ్యాలెట్ పేపర్ ముద్రణకు ఆదేశించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో పాటు కనకం శ్రీనివాసరావు, యెంగ్రెడ్డి శివారెడ్డి, గుణుకుల వెంకటేశ్వర్లు, గౌతుకట్ల వెంకటరావు, చుండూరు సత్యబాల సుందరరామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జూపూడి శ్యాంప్రసాద్, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత, గుమ్మా శ్రీనివాసరావు, ఉమర్ బాషాషేక్, తిరువీధుల శారద, వినయ్‌కుమార్ తండియెమ్మిల, గంగోలు శామ్యూల్, అహ్మద్ షేక్, అరిగల శివరామప్రసాదు, రామకోటయ్య మద్దుమాల, దారా విక్రం, వై శోభారాణి, రాధాకృష్ణమూర్తి దుక్కిపాటి, అన్న వరపు ఆనంద కిశోర్, దీపక్ పులుగు ఎన్నికల బరిలో నిలిచి ఉన్నట్లు ఆర్‌వో ప్రకటించారు.


ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు, ప్రతినిధులతో సమావేశమైన ఆర్‌వో నాగలక్ష్మి

కోడ్‌ని పాటిస్తూ ప్రచారం చేసుకోవాలి

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన కోడ్ ప్రకారం ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఆర్‌వో సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లకు బూత్ లెవల్ అధికారులతో పోలింగ్ బూత్ వివరాలు తెలియచేస్తు స్లిప్‌లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు కూడా ఓటర్లను మార్గదర్శకం చేస్తూ తెల్ల పేపర్‌పై పార్టీ గుర్తులు, రంగులు, లేకుండా కేవలం ఓటరు పేరు, పోలింగ్ బూత్, సీరియల్ నంబరుతో మాత్రమే ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసుకోవచ్చన్నారు. ప్రచార కార్యక్రమాలకు కరపత్రాలు, వీడియో సందేశాల్లో ఉన్న కంటెంట్‌కు ముందుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాల్లో, ఇతర ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సభలకు అనుమతులు సంబంధిత జిల్లాలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఫెసిలిటేషన్ సెంటర్లలో కాకుండా పాత విధానంలో ఉద్యోగులు 12 ఫారం ద్వారా దరఖాస్తులు రిటర్నింగ్ అధికారికి పోస్ట్‌లో అందిస్తే బ్యాలెట్ పేపర్‌ను పోస్ట్ ద్వారా అందిస్తామన్నారు. ఓటు వేసిన బ్యాలెట్ పేపర్లు మార్చి 3కి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు. 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లు దాటిన తర్వాత అభ్యర్థులు ఓటర్లను మార్గదర్శకం చేయడానికి కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అభ్యర్థులు ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖాజా వలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఓటర్ల జాబితా విడుదల

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సప్లిమెంటరీలతో కలిపి తుది ఓటర్ల జాబితా విడుదలైంది. గురువారం ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని జాబితాని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నవీకరించిన జాబిత ప్రకారం 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది స్త్రీలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 3,47,116గా ఉన్నది. పోలింగ్ కోసం 483 బూత్‌లను వినియోగించనున్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం కూడా పూర్తి చేసినట్లు ఆర్‌వో తెలిపారు. గుంటూరులో 149 బూత్‌లకు 185 మంది పీవోలు, 185 మంది ఏపీవోలు, 379 మంది ఓపీవోలు, 178 మంది మైక్రో అబ్జర్వర్లు, 26 మంది సెక్టోరల్, 26 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. వీరందరికి ఈ నెల 21న రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు 888 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల కోసం 1,444 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లను గుంటూరు నగరంలోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ఆర్‌వో వివరించారు.

జిల్లా	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
గుంటూరు	1,08,109	149
బాపట్ల	24,493	34
పల్నాడు	57,238	90
ఏలూరు	16,099	21
కృష్ణా	63,114	77
ఎన్‌టీఆర్	78,063	112

ఆప్కాస్‌ని రద్దు చేసే ఆలోచన సరైనది కాదు

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అప్కాస్ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. జీజీహెచ్ ఆవరణలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగిస్తే దాదాపు లక్ష ఇరవై వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. ఏజెన్సీ వ్యవస్థ కింద పనిచేసే సమయంలో దళారులు సకాలంలో జీతాలు, పీఎఫ్ చెల్లించకుండా వందల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఉండటం వల్లే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, సకాలంలో పీఎఫ్‌లు తీసుకుంటున్నామని అన్నారు. ఆప్కాస్‌లో పనిచేసే ఉద్యోగులకు మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని కోరారు. పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు మాట్లాడుతూ ఆప్కాస్‌ని రద్దుచేసి ఉద్యోగులకు అన్యాయం చేస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, నందిగామ నాగరాజు, ఎస్.కె పాచ్చా, స్నేహ, జానీ బాషా, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్‌గా ఉమ్మడి గుంటూరు జిల్లా



బహుమతులు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులు

కారంపూడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీఈటీ, శాప్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో జరిగిన 13 ఉమ్మడి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి సెమినార్ కం గేమ్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఓవరాల్‌గా నిలిచిందని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు, కారంపూడి జడ్పీహెచ్ఎస్ పీడీ స్వర్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఖాదర్ మస్తాన్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొని ఎక్కువ బహుమతులు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులను గురువారం పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్, జిల్లా సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు చిన రామయ్య, మాజీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ చిరంజీవిరావు, అసిస్టెంట్ స్కూల్ గేమ్ సెక్రటరీ రాధాకృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

చిలకలూరిపేట ఎంఈవో లక్ష్మి సస్పెన్షన్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ఈ నెల 10న పట్టుబడిన చిలకలూరిపేట ఎంఈవో-1 కె.లక్ష్మి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా ఆమె చిలకలూరిపేట వదిలి వెళ్లరాదని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



బ్లాక్ మార్కెట్లో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు

- రెండు నెలలుగా తీవ్ర కొరత
- డీఆర్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నా.. పంపిణీ చేయకపోవడం పై అనుమానాలు
- ఈ స్టాంపింగ్ వారి ప్రయోజనం కోసమేనని ఆరోపణలు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు స్టాంపు వెండర్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించే ఆలోచన చేశారు. అంతేగాక రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. చివరకు ఈ స్టాంపింగ్ విధానాన్ని కూడా ప్రైవేటు ఏజెన్సీకే కేటాయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎన్‌ఏసీ దీనిని నిర్వహించేది. అయితే వైసీపీ ప్రభుత్వం దీనిని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడమే కాకుండా రిజిస్ట్రేషన్ విధానాలను 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. అదే సమయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని కొనసాగించేందుకు నిర్ణయించింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అయినప్పటికీ ప్రభుత్వం ముందుకే వెళ్లింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల వినియోగాన్ని గతంలో మాదిరిగానే కొనసాగించాని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాల్సి ఉన్నప్పటికీ గత రెండు నెలలుగా గుంటూరులో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. సాధారణంగా ఈ నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఆస్తుల క్రయవిక్రయాల నుంచి ఒప్పందాల వరకు, అదేవిధంగా పబ్లిక్ కాపీలు, అఫిడవిట్లకు వినియోగిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. అవసరాలకు అనుగుణంగా ఆయా స్టాంపులను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో స్టాంపు వెండర్లకు అందజేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత అధికమైంది. ఇప్పటికే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది.

ఈ స్టాంపింగ్ వారి కోసమేనా...?

డీఆర్ కార్యాలయానికి స్టాంపుల ఇండెంట్ వచ్చినప్పటికీ సంబంధిత సిబ్బంది, వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా స్టాంపు వెండర్లకు పంపిణీ చేయడంలేదు. ఇది ఈ స్టాంపింగ్ వారి ప్రయోజనాల కోసమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే సాధారణంగా ప్రజలు ఈ స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఇదే కారణమని పలువురు స్టాంప్ వెండర్‌లు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈ స్టాంపింగ్ వినియోగించుకుందాం అనుకున్నా సర్వర్ సమస్యల కారణంగా అవి కూడా సరిగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

తిరునాళ్లలో ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



కోటప్పకొండలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. కోటప్పకొండలో తిరనాళ్ల బందోబస్తు ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. గత తిరునాళ్ల సమయంలో ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తితే, దానికి కారణం తెలుసుకుని ఆ విధమైన సమస్య ఉత్పన్నమవకుండా చూడాలని సూచించారు. తిరునాళ్ల బందోబస్తుకు పోలీస్ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. కోటప్పకొండ తిరునాళ్ళ, పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసినటువంటి పార్కింగ్ స్థలాలు, స్నానాల ఘాట్, ప్రభలు నిలిపే ప్రాంతాలు, బస్సులు నిలుపు ప్రదేశాలను త్రిపాఠి పరిశీలించారు. తిరునాళ్లకు సంబంధించి వివిధ ఏర్పాట్లు, వాహన రాకపోకలు, వాహనాల పార్కింగ్, భక్తుల కోసం క్యూలైన్ల ఏర్పాటు, ప్రభలు నిలుపు ప్రదేశాలు ఎంపికపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారుల సమన్వయంతో ఎక్కడైనా రోడ్లు వెడల్పు చేయించడం, రోడ్డు మార్గాలలో అవాంతరాలు ఉంటే తొలగించడం, బ్రిడ్జి, కల్వర్టులకు అవసరమైన చోట మరమ్మతులు చేయించాలన్నారు. తిరునాళ్ల ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, భారీ బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. కొండకు ప్రభలు తరలివచ్చే సమయంలో ఎటువంటి అవాంతరాలు ఎదురవకుండా, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు తగినంత మంది పోలీస్ సిబ్బందిని కేటాయించి తగిన చర్యలు తెసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, అదనపు ఏఆర్ ఎస్పీ వి. సత్తిబాబు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, ఎస్‌బీ సీఐలు బండారు సురేష్ బాబు, ఎస్‌బీ సీఐలు పి.శరత్ బాబు, నరసరావుపేట రూరల్ రామకృష్ణ, పట్టణ సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

అమృతలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ బాలకోటేశ్వరస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రికి లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేవస్థానం పరిసరాల్లో డ్రోన్ కెమెరాల నిఘాతోపాటు, సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ నారాయణ, చుండూరు సీఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఎస్ఐ అమర్‌వర్ధన్ ఉన్నారు.



మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

మిర్చి ధర తగ్గించేందుకు చూడొద్దు

- అలా చేస్తే లైసెన్సుల శాశ్వత రద్దు
- మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత హెచ్చరిక



చుట్టుగుంట సమీపంలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో మిర్చి ఎక్స్‌పోర్టర్లతో సమావేశమైన కమిషనర్ విజయ సునీత

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయబద్ధంగా రావాల్సిన మిర్చి ధరని తగ్గించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నం చేయొద్దని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. రైతులకు నష్టం చేయాలని చూస్తే ప్రభుత్వం ఊరుకోబోదని హెచ్చరించారు. మిర్చి రైతుల ఆర్థిక ప్రయోజనాలే తమకు ముఖ్యమని, వారికి ఇబ్బంది కలిగితే ఎంతటి వ్యాపారస్తుల లైసెన్సులనైనా శాశ్వతంగా రద్దు చేస్తామని మందలించారు. గురువారం సాయంత్రం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె మిర్చి విదేశీ ఎగుమతిదారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత 'ఆంధ్రజ్యోతి' గుంటూరు సంచికలో గురువారం 'మిర్చి ఎగుమతిదారుల రహస్య సమావేశం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అయితే సమావేశానికి హాజరైన ఎక్స్‌పోర్టర్లు తాము ఎక్కడా సమావేశం కాలేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ వెంటనే కమిషనర్ ఎగుమతిదారులను వారిస్తూ తమ వద్ద భేటీకి సంబంధించి సీసీ టీవీ ఫుటేజ్‌లున్నాయన్నారు. దీనిపై పూర్తి విచారణ జరుపుతున్నామన్నారు. ఎవరైనా ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు కావాలని మిర్చి ధర పెరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టొదన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి అనేక వ్యయప్రయాసలకోర్చి మిర్చిని పండించి తీసుకొస్తున్నారని చెప్పారు. రైతులు మిర్చి తీసుకురాకపోతే మీ వ్యాపారాలు మూసేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత వరకు ప్రస్తుతం ఉన్న ధర కంటే పెరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో మిర్చి విదేశీ ఎక్స్‌పోర్టర్లు వెలగపూడి సాంబశివరావు, తోట రామకృష్ణ, విజయకృష్ణ ట్రేడర్స్, మహేష్ ట్రేడర్స్, ఎస్‌కే ట్రేడర్స్ ప్రతినిధులు, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ బి.రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరీ ఎ.చంద్రిక, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి సీఎం చొరవ చూపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ యాజమాన్య ఆస్తులతో పోల్చుకుంటే బాధితులకు చెల్లించాల్సిన మొత్తం లెక్కలోనిది కాదనీ, సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా అమరావతిలో రెండు రోజులుగా జరుగుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో గురువారం కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రిని కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు తెలియజేస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ బాధితుల సమస్యల పరిష్కారానికి పోరాటమే సరైన మార్గం అన్నారు. రెండు రోజుల సమావేశాలలో తీసుకున్న కార్యాచరణలో భాగంగా ఈ నెల 19, 20 తేదీలలో ఎంపీలు, ఎమ్మెల్యేలకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని తెలిపారు. 24న అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో అందజేయడంతోపాటు మార్చి 5 నుంచి రిలే నిరాహార దీక్షలు, చివరి రోజున భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కర్నాటక రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గురుమూర్తి, ఒరిస్సా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరావు, తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం.. ఆనందం

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలి సమస్యలన్నింటికి ఒకే ఒక పరిష్కారం 'యోగ-ధ్యానం' అని కోయంబత్తూర్ వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ టీడీ ఎస్.ప్రసాద్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత ఐక్యత - బాహ్య సమతుల్యతలకు యోగ, ధ్యానమే సాధనాలని ఆయన తెలిపారు. రెండు రోజులుగా యోగా విభాగంలో జరిగిన జాతీయ కార్యశాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రచార్యులు పి.జాన్సన్, సత్యమూర్తి, జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన సుధాదేవి, సిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ ప్రియాంక, సమన్వయకర్త డి.సూర్య నారాయణ, రాధిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టం చూస్తూ ఊరుకోదు

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని నేరాలు చేసే నాయకుల విషయంలో చట్టం తనపని తాను చేసుకు పోతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్టుకు సంబంధించి వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంపై ప్రవీణ్ స్పందించారు. వంశీ వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్మోహనరెడ్డి మెప్పుకోసం రాజకీయ భిక్ష పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైన, నారా లోకేష్, నారా భువనేశ్వరిపైన అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. అంతేకాకుండా గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేయించిన వంశీని అరెస్టు చేయడం సబబే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గం నుంచి పారిపోయి హైదరాబాద్‌లో దాక్కున్న వంశీ పట్ల చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు చేయించే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదన్నారు.

మహిళపై హత్యాయత్నం

- వివాహేతర సంబంధంతో విభేదాలు
- నడిరోడ్డుపై ఉలితో దాడి

వేమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉదయం 10 గంటల సమయంలో ప్రధాన రహదారిపై ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని జంపని గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జంపని దళితవాడకు చెందిన ఏటుకూరి భాగ్యలక్ష్మి ఐదేళ్ల క్రితం భర్తతో విభేదాలు వచ్చి వదిలి వేసింది. ఆమెకు ఒక కుమార్తె ఉంది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన కార్పెంటర్ యల్లమాటి ప్రభాకర్‌తో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. వారిద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రభాకరరావు తన ఆలోచనకు వ్యతిరేకంగా భాగ్యలక్ష్మి వ్యవహరిస్తోందన్న కోపంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. భాగ్యలక్ష్మి జీవనోపాధి కోసం తెనాలిలోని ఓ దుకాణంలో పని చేస్తుంది. రోజు మాదిరిగానే ఉదయం 10.30 గంటలకు ద్విచక్ర వాహనంపై జంపని నుంచి తెనాలి వెళ్తోంది. కొత్తగా నిర్మాణంలో ఉన్న ఆయిల్ బంకు వద్దకు చేరుకుంది. అదే సందర్భంలో తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న ప్రభాకర్ తన చేతిలో ఉన్న కర్రను భాగ్యలక్ష్మి వాహనంపైకి విసిరి వేయడంతో ఆమె కిందకు పడిపోయింది. ఈ సందర్భంలో దగ్గరకు వెళ్లిన ప్రభాకర్, భాగ్యలక్ష్మిల మధ్య వివాదం చెలరేగింది. ప్రభాకర్ కార్పెంటర్ పనికి సంబంధించిన వస్తువుల్లో ఉలి తీసుకుని భాగ్యలక్ష్మి ఎడమ చేతిపైన, వీపు పైన తీవ్రంగా గాయపరిచాడు. సమీపంలో ఉన్న ప్రజలు దగ్గరకు వచ్చి గాయాలతో పడిపోయిన భాగ్యలక్ష్మిని తెనాలి ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిని కబ్జా చేసి కూల్చారు

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తురకా కిషోర్ పేరు చెప్పి తమను చంపుతామని బెదిరిస్తున్నారనీ, తన కుమార్తెకు తాను ఇచ్చిన ఇంటిని కూల్చి కబ్జా చేశారనీ, ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన పెద్దిరాజు, కృష్ణ, యండూరి వంశీ, ధనావత్ రమాదేవీ ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని చల్లా శివకుమార్ గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అలాగే బాపట్ల జిల్లా భర్తిపూడిలో తమ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా సర్వే నంబర్ 65/2లో అక్రమ లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారని, దీంతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని, దీనిపై అధికారులు దృష్టి పెట్టి అక్రమ లేఅవుట్లను రద్దు చేయాలని ఆచంట అమరేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి చెందిన చల్లా మంగమ్మ తమకు వారసత్వంగా వచ్చిన భూమిలోకి వెళ్లకుండా దారిలేదంటూ పైపొలం వారు అడ్డుకుంటున్నారని, దీనిపై సర్వే చేసి తాము పొలంలోకి వెళ్లేందుకు దారిని కల్పించాలని అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.


ఎల్ఎల్‌బీ పరీక్షా కేంద్రాల తనిఖీలు



పరీక్షా కేంద్రంను పరిశీలిస్తున్న ఆచార్య సుబ్బారావు

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న ఎల్.ఎల్.బి. 3వ సెమిస్టర్, 7వ సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను పీజీ కోర్సుల సమన్వయ కర్త ఆచార్య ఎమ్.సుబ్బారావు తనిఖీ చేశారు. గురువారం గుంటూరులోని జె.సి.కాలేజ్ ఆఫ్ లా పరీక్షా కేంద్రంలో ఆయన పరీక్షల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

ఎల్ఎల్ఎమ్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గత అక్టోబరు నెలలో జరిగిన ఎల్.ఎల్.ఎమ్. రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో బుధవారం పొందుపర్చినట్లు పరీక్షల నిర్వహణ నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 87 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పునఃమూల్యాకనం కోసం ఫిబ్రవరి 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

1,35,941 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,013 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,35,941 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 57,175 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600	334	9000	11500
నెంబరు. 5	10000	12500	నెంబరు.5	--	--
273	10000	12200	273	--	--
341	10000	14200	341	--	--
4884	10000	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13900	తేజ	--	--
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	9000	11700
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	7500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జెండా ఊపి సర్వీసును ప్రారంభిస్తున్న డీపీటీవో రవికాంత్ తదితరులు

కుంభమేళాకు ఆర్టీసీతో సురక్షిత ప్రయాణం

● డీపీటీవో రవికాంత్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని మహా కుంభమేళాకు ఆర్టీసీ సర్వీసులతో సురక్షితమైన ప్రయాణం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం రవికాంత్ తెలిపారు. గుంటూరు-1 డిపోకు చెందిన బస్సును ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లేందుకు ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆయన గురువారం ప్రారంభించారు. ఆర్టీసీతో సురక్షితం, సుఖవంతమైన ప్రయాణం ఉంటుందన్నారు. ప్రయాణీకులు ముందుగా టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గుంటూరు-1 డిపో మేనేజర్ ఎంవీఎస్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్లు వీవీ నరసింహరావు, నరసింహనాయక్, ఆంజనేయులు, పలువురు అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన స్థానిక పేరేచర్ల మైదానంలో సీనియర్ మెన్స్ విభాగంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరి క్రాంతికుమార్, దుర్గామోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నల్లమడ జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారన్నారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభచూపిన క్రీడాకారులు మార్చి 20 నుంచి అనంతపురంలో జరిగే ఏపీ సూపర్ లీగ్ మెన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 73375 85790 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే మద్దతు ధర చట్టాన్ని అమల్లోకి తెచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కోరారు. స్థానిక బ్రాడీపేట, రైతు సంఘం కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఫిబ్రవరిలో క్వింటాకు రూ.18వేలు ఉన్న మిర్చి ధర ఈ ఏడాది కేవలం రూ.10వేల లోపు ఉండటం బాధాకరమన్నారు. ఎకరాకు రూ.2 లక్షలకుపైగా నష్టం వచ్చేలా ఉందన్నారు. ఒకవైపు ధర లేక మరో వైపు రకరకాల దోపిడీకి గురవుతూ రైతులు కుదేలవుతున్నారన్నారు. మిర్చియార్డును ప్రక్షాళన చేస్తానని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయ మంత్రి అచ్చన్నాయుడు ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారిపోయాయన్నారు. యార్డును ప్రక్షాళన చేసి రైతులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఇమ్మడి రామారావు, జొన్నల కోటిరెడ్డి, కే నాగేశ్వరరావు, కే శ్రీనివాసరావులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా అసోసియేషన్ నాయకులు కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనం తరువాత పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన సదుపాయాలు నేటికీ అందలేదన్నారు. ఇపీఎఫ్-95 పథకం ద్వారా రూ 2,500 పెన్షన్ తప్ప మరేమీ రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పదవీ విరమణ సదుపాయాలతో పాటు ప్రభుత్వ పథకాలను అమలుచేయాలని కోరారు. ఉద్యోగి భార్య చనిపోయినపుడు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలు ఇవ్వాలన్నారు. సమస్యలను ప్రభుత్వానికి తెలుపుతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గంగాధర్‌రావు, జీ నాంచారయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, రామచంద్రరావు ఉన్నారు.

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలో శ్రీ రమా సత్యనారాయణస్వామి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఉదయం యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ, మౌనబలి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శేషురాణి, భువనేశ్వరి బృందం స్వరార్చన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను దేవస్థాన చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ పర్యవేక్షించారు.

జేకేసీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు ఉపాధి శిక్షణ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో డిగ్రీ విద్యార్థులకు ఉపాధి శిక్షణ అందించారు. యూఎన్ఎస్ఏటీ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై వెంకటేశ్వరరావు, డాక్టర్ వై సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు

ఆప్కాస్ రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉప సంహరించుకోవాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ ద్వారా లక్షా ఎనభైవేల మంది పొరుగు సేవ ఉద్యోగులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ కింద పనిచేసే సమయంలో దళారులు సకాలంలో జీతాలు, పీఎఫ్ చెల్లించకుండా వందల కోట్లు దోపిడీ చేశారన్నారు. రాబోయే రోజుల్లో ఆప్కాస్ కంటే మెరుగైన విధానాన్ని రూపొందించాలని, అంతేగాని రద్దు చేయడం సబబు కాదన్నారు. సమావేశంలో లక్ష్మీనారాయణ, నాగూర్‌వలి, పెదరత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

19న వాహనాల వేలం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించకుండా తిరుగుతూ రవాణా శాఖ అధికారుల దాడులలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 19 తేదీన వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉప రవాణ కమిషనర్ కే సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో ఎల్‌జీవీలు, మోటారు సైకిల్స్, కారు, మ్యాక్సిక్యాబ్‌లు మొత్తం 31 వాహనాలను వేలంలో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. సంబంధిత వాహనదారులు పన్నులు, జరిమానాలు ఈనెల 18వ తేదీ లోపు చెల్లించి వాహనాలను విడిపించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో 19న స్థానిక స్వర్ణభారతినగర్, ఆర్టీవో కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

వెంగళాయపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

● అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీఆర్‌ఓపై దౌర్జన్యం

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించారు. ఇన్‌చార్జి వీఆర్‌ఓ(పొత్తూరు) గుమ్మడి నవీన్ కుమార్‌పై దౌర్జన్యం చేసి ఆయన విధులకు ఆటంకం కలిగించారు. వెంగళాయపాలెం గ్రామానికి చెందిన కొండముది భగవాన్‌దాస్, దర్శనం శ్రీనివాస్, బండ్లమూడి శంకర్‌బాబు, తలతోటి వెంకటరావు, వెల్లటూరి జయరాజ్, చింతపల్లి సాల్మన్ తదితరుల ఆధ్వర్యంలో కొంతమంది వెంగళాయపాలెం పరిధిలోని 1241 /1బి సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ప్రశ్నించిన వీఆర్‌ఓపై దౌర్జన్యం చేయడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్దేశిత గడువులో పనులు పూర్తిచేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాస్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలో కొనసాగుతున్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ తమ రోజువారీ పర్యటనలో భాగంగా ఆదర్శ నగర్, ఏటీ అగ్రహారం, పెద్ద పలకలూరు, స్వర్ణాంధ్రనగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్ల పనులను స్థానిక ప్రజల అవసరాలరీత్యా, ప్రాధాన్యత క్రమంలో చేపట్టడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డు సచివాలయాల వారీగా తాగునీటి పైప్ లైన్ లీకులు, మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత ఏటీ అగ్రహారం మస్టర్ పాయింట్ వద్ద కార్మికుల హాజరుని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, ఆర్వో రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్ లు ఆనంద కుమార్, సోమశేఖర్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమితోనే డీఎస్సీ కల సాకారం: ఎమ్మెల్యే నసీర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల డీఎస్సీ కల సాకారం కావాలంటే అది కూటమితోనే సాధ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని జైన్ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజనరీ నాయకులను ఎన్నుకోవడం ద్వారా మనతోపాటు పిల్లల భవిష్యత్తు కూడా ఉజ్వలంగా మారుతుందని నసీర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాను కూటమి ప్రభుత్వం బలపరిచిందని, సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన తీర్పును మరోసారి రిపీట్ చేయాలని ఆయన కోరారు. డీఎస్సీ నియామకాలకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మరో మూడు నెలల్లో చర్యలు చేపడుతుందని తెలిపారు. గత ప్రభుత్వం డీఎస్సీ పేరిట ఉపాధ్యాయులను మోసగించిందని నసీర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో జైన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మున్నా, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు చిన్న బుజ్జి, క్లస్టర్ చల్లా ఆంజనేయ ప్రసాద్, వాకా వీరారెడ్డి, లక్ష్మణరావు, బాజీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం



స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, విస్తరణ అధికారి శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ దివస్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరమని గుంటూరు రూరల్ మండలం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అన్నారు. రూరల్ పరిధిలోని లాలుపురం గ్రామంలో గురువారం స్వచ్ఛ దివస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, బ్లీచింగ్, సున్నం నిల్వచేసుకోవడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకుని నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● నేడు రూరల్ మండల సర్వసభ్య సమావేశం

కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన శుక్రవారం రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

వెస్ట్ సబ్ డివిజన్‌లో నాకాబందీ

● 25 వాహనాలు సీజ్.. రూ.4.50 లక్షల జరిమానా



నాకాబందీ నిర్వహిస్తున్న అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం క్రైమ్స్ అదనపు ఎస్పీ సుప్రజ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీజేపీఎస్, జేకేసీ కళాశాల వద్ద నాకాబందీ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే చట్టపరంగా అపరాధ రుసుంతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపుతూ పట్టుబడితే తల్లిదండ్రులదే బాధ్యతన్నారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 106 వాహనాలు పట్టుబడగా రూ.3లక్షల 12వేల 400 అపరాధ రుసుం విధించారు. సరైనపత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను, మద్యం తాగి నడుపుతున్న ఆటోను సీజ్ చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలలో 145 ద్విచక్ర వాహనాలు పట్టుబడగా వాటిలో 129 వాహనాల నుంచి సుమారు రూ.లక్షా 35 వేల 565 అపరాధ రుసుముగా విధించి, సరైన పత్రాలు లేని, మద్యం తాగి నడుపుతున్న 16 వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు అజీజ్, అరవింద్, సీఐలు వీరాస్వామి, వీరేంద్ర బాబు, సింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకుని మోసం

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేటకి చెందిన సజ్జా అనితాచౌదరి అనే మహిళ సత్తెనపల్లిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్యాకల్టీగా పని చేస్తోంది. ఆమెకు కన్నెగంటి ప్రవీణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రెండుదఫాలుగా రూ 60వేలు తీసుకొని జాబ్ ఇప్పించకుండా మోసం చేశాడు. అసభ్యంగా తిట్టి, చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలు నెట్‌లో పెడతానని ప్రియుడి బెదిరింపులు

అరండల్‌పేటకి చెందిన ఓ మహిళ ఐదు సంవత్సరాల క్రితం జయప్రకాష్ అనే వ్యక్తిని ప్రేమించింది. తరువాత అతని ప్రవర్తన నచ్చక దూరంగా ఉంటోంది. ఆమెకి వేరే అతనితో పెళ్లి కుదిరింది. దీంతో గత కొన్నిరోజులుగా జయప్రకాష్ ఆమెతో గతంలో దిగిన ఫొటోలు అందరికీ పంపిస్తా, నెట్‌లో పెడతా అంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

డైరీ ఆవిష్కరించిన దేవినేని ఉమ

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన టీఎన్‌టీయూసీ, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర డైరీలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సమక్షంలో మాజీ మంత్రి దేవినేని ఉమ ఆవిష్కరించారు. గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మద్దూరి వెంకటరమణ, విష్ణు ప్రసాద్, ఎన్ ప్రసాద్, శ్రీనివాసరావు, హేమంత్, హరీష్ శిరీశ్, గోపి రాము, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీలను అరెస్టు చేస్తే తప్పేంటి..? :కనపర్తి

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ లాంటి రౌడీలను అరెస్టు చేస్తే తప్పేంటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీ అరెస్టుపై వైసీపీ నాయకులు అంబటి రాంబాబు తదితరులు ఆంబోతుల్లా రంకెలు వెయటం సిగ్గుచేటని విమర్శించారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు జగన్ రెడ్డి అండ చూసుకొని నాడు నవ్వుతూ చేసిన పాపాలు నేడు ఏడుస్తూ అనుభవించక తప్పదన్నారు. వంశీ అరెస్టును ప్రజలు హర్షిస్తున్నారని, ఆయనతోపాటు కొడాలి నాని, ద్వారంపూడి అరెస్టుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

చేసిన తప్పులకు శిక్ష ఖాయం

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులకు శిక్ష ఖాయమని తెలిసే ఓట్ల లెక్కింపురోజునే వల్లభనేని వంశీ దేశం వదిలి పారిపోయాడని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ అన్నారు. వంశీ అరెస్టుపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిలాంటి భువనేశ్వరి గురించి నీచంగా మాట్లాడడమే కాకుండా, రాజకీయంగా జన్మనిచ్చిన పార్టీ కార్యాలయం మీద దాడి చేయడం, ఫిర్యాదు చేసిన వ్యక్తిని కిడ్నాప్ చేసి ప్రాణాలు తీస్తానని భయపెట్టి కేసును ఉపసంహరించుకోమనడం క్షమించరాని నేరాలన్నారు. వంశీ, నానీలను సమర్థించే జగన్‌రెడ్డికి పార్టీని నడిపే అర్హతే లేదన్నారు.

19 నుంచి టెక్నికల్ కోర్స్ పరీక్షలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగరంపాలెంలోని స్టార్ గర్ల్స్ హైస్కూల్, సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య, సాధు సుబ్రహ్మణ్యం ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు, సాయంత్రం రెండు గంటల నుంచి 4:30 వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల హాల్ టికెట్లతో పాటు, ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు బీఎస్ఈఏపీడాట్ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా పోలీసుల ప్రతిభ




పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అనంతపురంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఈనెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించిన 43వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా పోలీసులు ప్రతిభ చూపారు. వివిధ వయసుల వారీగా జిల్లా నుంచి పాల్గొన్న ఏడుగురు మొత్తం 21 పతకాలు సాధించగా వీటిలో 8 బంగారు పతకాలు ఉన్నాయి. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన ఏఆర్ ఎస్ఐ ఆర్ చంద్రశేఖర రావు, ఏఆర్‌హెచ్‌సీ ఎండీ షాహిదుల్లా, ఏఆర్ పీసీ బి.కృష్ణారావు, చేబ్రోలు ఏఎస్ఐ మైలా సాంబశివరావు, ఫింగర్ ప్రింట్స్ పీసీ ఎం.లక్ష్మయ్య, వెస్ట్ ట్రాఫిక్ పీసీ డి.తిరుమల రావు, ఏఆర్ పీసీ డి.కిరణ్‌కుమార్‌లు ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి ఆయన చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. వీరితో పాటు గుంటూరు జిల్లా నుంచి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ చుక్కా కొండయ్య, రత్నాకర్, ఆఫీసర్స్ క్లబ్ ఉద్యోగి దివాకర్ కూడా ఉన్నారు. మొత్తంగా గుంటూరు జిల్లా క్రీడాకారులు 102 పతకాలు సాధించడంతో జిల్లాకు ఓవరాల్ మెన్ ఛాంపియన్‌షిప్ అవార్డు దక్కిందని ఎస్పీకి వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నందివెలుగు రోడ్డు, గాంధీనగర్, ఆర్టీసీకాలనీ, ధనమ్మ హోటల్ సెంటర్, నవభారత్‌నగర్, రాఘవనగర్, వెంకటరావుపేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలానే సాకేతపురం, ఆంజనేయపేట, కొరిటపాడు రెడ్లబజార్, పార్కు ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య మరో ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యానగర్ మొదటి లైను నుంచి రెండో లైను వరకు, కల్యాణి రోడ్డు, సాయిబాబా రోడ్డు, రింగ్‌రోడ్డు విద్యానగర్ రెండో లైను నుంచి బీఎస్ఎన్ఎల్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న గళ్లా మాధవి

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్దాం

ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నేతలతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళదామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పార్టీ నేతలకు సూచించారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, పరిశీలకుడు సింహాద్రి కనకాచారిలతో కలిసి గురువారం ఆమె కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓట్లు అత్యధికంగా ఉన్నాయని, ఇంటింటికీ తిరిగి వారిని కలిసి ఓటు ఎలా వేయాలనే విషయాన్ని వివరించాలన్నారు. రాష్ట్రంలో మంచి పాలనకు తోడ్పాటునందించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో ముత్తినేని రాజేష్, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, ఆడక పద్మావతి, శ్రీవల్లి, సుఖవాసి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, రావిపాటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డీ గతం మరిచిపోతే ఎలా?

'మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాసం పెట్టబోతున్నారని, ఇది ప్రజాస్వామ్యమా' అంటూ దీర్ఘాలు తీస్తున్న స్వయం ప్రకటిత ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి గతం మర్చిపోతే ఎలా అని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన ఎలా గెలిచాడో అందరికీ తెలుసన్నారు. తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అన్ని సీట్లను క్లీన్ స్వీప్ చేశామని, జగన్ నాయకత్వం మీద నమ్మకం లేకనే వైసీపీ కార్పొరేటర్లు ఎన్డీయే కూటమి నేతలకు జైకొట్టారన్నారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి, ప్రజాసమస్యలపై పోరాడితే బాగుంటుందని ఎమ్మెల్యే హితవు పలికారు.

● జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే మాధవిని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి సన్మానించారు. స్ఫూర్తిదాయక మహిళలను సత్కరించుకోవడం సమాజపు కనీస బాధ్యత అని ఆయన అన్నారు.

డి 7 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 246 మందికి రూ.8.44 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్స్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి గుంటూరు టౌన్-1 ఈఈ శ్రీనివాసబాబు నేతృత్వంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ ఈఈ బీ విజయకృష్ణ, పోలీసు ఇన్‌స్పెక్టర్ విజిలెన్స్ డీ వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో నగరంలోని డి 7 సెక్షన్ పరిధిలో గురువారం విజిలెన్స్ బందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సెక్షన్ పరిధిలోని గోరంట్ల, జొన్నలగడ్డ, రెడ్డిపాలెం ప్రాంతాల్లో 55మంది అధికారులు, 160మంది సిబ్బంది, 55 బృందాలుగా ఏర్పడి 4029 సర్వీసులు తనిఖీలు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో అనుమతిలేకుండా నేరుగా విద్యుత్‌చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో అదనపు లోడ్ వినియోగించటంపై 246మందికి రూ.8.44లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌చౌర్యానికి పాల్పడేవారిపై 94408 12263, 94408 12360కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఈఈలు కె.రవికుమార్, పీహెచ్ ఖాన్, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆపరేషన్స్ ఏఈ వీ బాజీ తదితరులున్నారు.

వైసీపీ నగర అధ్యక్షురాలిగా నూరిఫాతిమా

● మహిళా కోటాలో ఫాతిమాకు అవకాశం

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్షురాలిగా ఆ పార్టీ గుంటూరు తూర్పు సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా నియమితులయ్యారు. అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు ఆ పార్టీ అధిష్టానం గురువారం రాత్రి అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా వారసురాలిగా రాజకీయ అరంగేట్రం చేసిన నూరిఫాతిమా గత ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మొన్నటివరకు వైసీపీ నగర అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నియమితులయ్యారు.



అగ్గి రేగితే... బుగ్గే

● మిర్చియార్డులో యథేచ్ఛగా ధూమపానం

● పట్టించుకోని అధికారులు



మిర్చియార్డులో సిగరెట్లు కాలుస్తున్న హమాలీలు, వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల కోట్ల రూపాయల విలువ చేసే రైతుల మిర్చి టిక్కీలు దిగుమతి జరుగుతున్న మిర్చియార్డులో ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది వ్యాపారస్థులు, గుమాస్తాలు, హమాలీలు, దొడ్డి కాపలాదారులు యథేచ్ఛగా ధూమపానం చేస్తున్నారు. అలా చేయడం ఎంతో ప్రమాదకరమని తెలిసినప్పటికీ అధికార యంత్రాంగం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. బ్లాకుల వారీగా సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులున్నప్పటికీ వారించడం లేదు. ఈ నేపథ్యంలో మిర్చియార్డులో ఎప్పుడు ఎలాంటి అగ్నిప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళనకరమైన వాతావరణం నెలకొన్నది. రోజుకు లక్షన్నర మిర్చి టిక్కీల వరకు దిగుమతి అవుతున్న ప్రస్తుత తరుణంలో ఏదైనా జరిగితే వెంటనే మంటలను అదుపు చేయడం కూడా అగ్నిమాపక శకటాలకు సాధ్యం అయ్యే పని కాదు. అదే జరిగితే రూ.వందల కోట్లలో అటు రైతులకు, ఇటు మార్కెటింగ్ శాఖకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నది.

మిర్చియార్డు సుమారు 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్నది. ప్రస్తుతం సీజన్ కావడంతో రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు మిర్చిని అమ్ముకొనేందుకు యార్డుకు లారీలలో తీసుకొస్తున్నారు. కమీషన్ దుకాణాల్లో టిక్కీలు నిండిపోతుండటంతో అంతర్గత రోడ్లపై షాపుల ఎదురుగా దిగుమతి చేస్తున్నారు. ఉదయం పూట యార్డు కిక్కిరిసిపోయి ఉంటున్నది. ట్రేడింగ్ జరిగి కాటాలు అయిపోయిన తర్వాత సాయంత్రానికిగాని ఖాళీ అవడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. అయితే యార్డులోకి యథేచ్ఛగా సిగరెట్లు, లైటర్లు, అగ్గిపెట్టలతో వచ్చేవారిని లోపలికి అనుమతిస్తున్నారు. కనీసం ఎలాంటి చెకింగ్‌లు కూడా జరగడం లేదు. ఇలాంటి నిర్లక్ష్యమే 2008లో రైతులు, మార్కెటింగ్ శాఖ, వ్యాపారస్థుల పాలిట శాపమైంది.

అప్పట్లో మిర్చి సీజన్ ముగింపు దశకు చేరుకొన్న తరుణంలో ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల వ్యవధిలో మంటలు కమీషన్ దుకాణాలకు వ్యాపించి చుట్టుముట్టేశాయి. ఆ ప్రమాదంలో రూ.కోట్ల నష్టం జరిగింది. అప్పట్లో మిర్చి ధర చాలా తక్కువగా ఉన్నది. ఇప్పుడు క్వింటాల్ రూ.12వేలకు పైగా ఉన్నది. ఈ పరిస్థితుల్లో ఏమైనా ప్రమాదం జరిగితే రూ.వందల కోట్ల నష్టం వాటిల్లుతుంది. మార్కెటింగ్ అధికారులు ఎంతసేపటికి యార్డులో పర్యటిస్తూ భోజన శాల, విశ్రాంతి గదులు, కమీషన్ దుకాణాలను పరిశీలిస్తున్నారే తప్పా ధూమపానం చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో అవసరమైన తాత్కాలిక సిబ్బందిని నియమించి అయినా సరే యార్డులోకి సిగరెట్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు వంటివి తీసుకురాకుండా చూడాలి. అలానే లోపల ఉన్న దుకాణాల్లో సిగరెట్ల వంటివి విక్రయించకుండా నిరోధించాలి.

పశుపోషకులకు పాడి పాఠాలు

● నాలుగు జిల్లాల పాల రైతులకు గుంటూరులో శిక్షణ

● ఉత్పత్తి ఖర్చు తగ్గించడం.. పాలరేటు పెంచటమే లక్ష్యం



ప్రసంగిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించే పాడి పరిశ్రమకు కొత్త జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం అయింది. అందులో భాగంగా పశుపోషకులకు ప్రత్యేకంగా పాఠాలు చెప్పించేందుకు రంగం సిద్ధం చేసింది. గుంటూరులోని ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో నాలుగు జిల్లాల పాల రైతులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. గుంటూరు, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పాల రైతులకు పశుపోషణ, మెలకువలపై జనవరి నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ.నరసింహారావు తెలిపారు. ఇప్పటి వరకు 70 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. 10 కంటే ఎక్కువ పాడి పశువులు కలిగిన రైతులను పిలిపించి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పాల ఉత్పత్తి ఖర్చు తగ్గించడం, పాల ధర పెంచటం తద్వారా పాడి రైతును ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా శిక్షణ తరగతులు జరుతున్నాయని తెలిపారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా రైతులను డైరీ ఫామ్‌లకు తీసుకువెళ్లటం, బ్యాంకర్లతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నరసింహారావు తెలిపారు. మొత్తంగా పాడి రైతుకు అన్ని విధాలా ప్రోత్సాహం కల్పించి గ్రామాలను ఆర్థికంగా తిరుగులేని స్థితికి తీసుకువెళ్లటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని చెప్పారు.

చాలా విషయాలు తెలిశాయి..



చాలా కాలం నుంచి పశుపోషణలో ఉన్నాయి. పాల ఉత్పత్తి పెంచటంలో పెద్దగా మెలకువలు తెలియదు. ఈ శిక్షణ వలన నాకు చాలా విషయాలు తెలిశాయి. వంద రోజుల్లోపు గేదె గర్భం దాల్చేలా చూడటం ఎంత ముఖ్యమో ఇక్కడ తెలుసుకున్నాను. ఇవి తెలియక ఇన్నాళ్లు చాలా నష్టపోయాం. ప్రభుత్వం మాకు ఉపకరించే కార్యక్రమం ఏర్పాటు చేసింది.

- వల్లపుదాసు లక్ష్మణరావు, పెద్దవరం, నగరం మండలం

పాడి పరిశ్రమకు అండ...



నాకు 10 పాడి గేదెలు ఉన్నాయి. స్వయంగా పోషణ తయారు చేసుకోవటం ఎలానో ఇక్కడ నేర్పించారు. ఇన్నాళ్లు ఈ విషయాలు తెలియక పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయి మాకు మిగిలింది ఏమీ లేకుండా పోయింది. డైరీ ఫామ్‌కు కూడా తీసుకువెళ్లారు. అక్కడ కొన్ని మెలకువలు నేర్చుకున్నాం.

- పత్రా నాగలింగం, పెదపరిమి, తుళ్లూరు మండలం

గతంలో ఇటువంటి శిక్షణ జరగలేదు



ఇప్పటికి నాలుగు జిల్లాలకు చెందిన 70మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. గతంలో ఇటువంటి శిక్షణ ఎప్పుడూ జరగలేదు. మొట్టమొదటిసారి ప్రభుత్వం పాడిరైతుల కోసం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులు ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. బ్యాంకులకు వెళ్లి రుణాలు ఎలా పొందాలో కూడా తెలియజేయడం వలన రైతుకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఒక లీటరు పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఎలా తగ్గించాలో ఇక్కడ నేర్పించాం.

- శ్రీనివాస్, ఏడీ, ప్రాంతీయ పశు శిక్షణా సంస్థ

ప్రేమానుబంధం

(5వ పేజీ తరువాయి)

ధ్రువాలుగా మారిపోతున్నారు. సినిమాల్లో చూపించే ప్రేమ సన్నివేశాలను చూసి వాటినే ప్రేమని భ్రమించి చిన్నారులు కూడా తప్పుదారి పడుతున్నారు. బాల్యంలో ఏర్పడే నిర్మలమైన, నిష్కల్మషమైన ఇష్టాన్ని ఈ అపసవ్య ప్రేమలు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా స్కూలు వయసులోనే చిన్నారులు ప్రేమ వలలో చిక్కి విలవిలలాడుతున్నారు.

లక్ష్యాల ఛేదనతోనే ప్రేమ గమ్యం!

చదువుకునే వయసులో ప్రేమలో పడితే ఇక జీవితం అంతే! ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదనలో మునిగిపోతే భవిష్యత్తు అంధకారమే! అందుకే ప్రేమ అనే గమ్యస్థానం చేరాలనుకునే యువకులు ఎన్నో లక్ష్యాలను ఛేదించుకుంటూ ముందుకు సాగాలి. తొలిగా జీవితాన్ని గెలవాలి. అందుకోసం తనకు తానుగా నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. ఒక వేళ ప్రేమలో పడినా.. దాన్ని జీవితాన్ని నిర్మించుకునే ప్రస్థానంగా మలుచుకోవాలి. యువతరం.. నవతరం.. తమ లక్ష్యాలను ఛేదించుకుంటూ.. ప్రేమ గమ్యస్థానం చేరుకోవాలి.

22 ఏళ్లు ప్రేమమయం..

ప్రేమకు మూడు సూత్రాలు అనివార్యం. అభిప్రాయాలకు విలువ ఇచ్చుకుని గౌరవించుకోవడం.. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం.. ఒకరి పట్ల ఒకరు ఓపికగా వ్యవహరించడం.. ఈ మూడూ ఉంటేనే ఆ ప్రేమ బతుకుతుంది. తల్లిదండ్రులు- బిడ్డల మధ్య ఈ మూడు అంశాలు స్పష్టంగా ఉంటాయి. అందుకే ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆ అనుబంధం తెగిపోదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ అనేది వారి తల్లి దండ్రుల వద్దే మొదలవుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. యువతీ యువకుల మధ్య ఉండే ప్రేమ కూడా అలా ఉండాలి. 2003లో దగ్గరైన మేము 2005లో ఒక్కటయ్యాం! ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మా 22 ఏళ్ల పయనం ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రేమమయంగానే సాగింది. రెండు దశాబ్దాల మా పయనంలో అపోహలు, అపార్థాలు రాకుండా ఉంటాయా? కానీ వాటిని ఓపికతో అర్థం చేసుకుని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాం. కుల సమస్య కావచ్చు, ఆర్థిక సమస్యలు కావచ్చు.. పెద్దల అయిష్టత కారణంగా మా కుటుంబాల నుంచి తొలినాళ్లలో ఎదురైన ఇబ్బందులు కావచ్చు.. ఓపికతో ఎదుర్కొన్నాం. జీవితంలో ఎదురైన ప్రతీ కష్టం మా బంధాన్ని మరింత ఘాడపరిచింది.



- గల్లా మాధవి, రామచంద్రరావు

మారుతోన్న అభిప్రాయం



గతంతో పోలిస్తే యువతలో ప్రేమపై అభిప్రాయం మారుతోంది. పూర్తిగా కంఫర్ట్ జోన్‌లో ఉండాలనుకుంటున్నారు. దీని కోసం కుటుంబ బంధాలను కూడా కాదనుకుంటున్నారు. తల్లి దండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులలో ఎక్కువశాతం సోషల్ మీడియాకు సంబంధించినవే ఉంటున్నాయి. మనం కోరుకున్నది మన చెంతకు చేరాలంటే కెరీర్‌పరంగా, కుటుంబ పరంగా అందరి ఆమోదం అవసరమే. కాకపోతే గతంతో పోలిస్తే ప్రేమ విషయంలో కుల, మతాల పట్టింపుల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనాతీరు మారుతుండడం శుభపరిణామం

-షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

మంచి.. చెడు రెండూనూ



ప్రేమ అనేది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం వంటిది. పూర్తి స్థాయిలో ఒకరికొకరు అర్థం చేసుకుంటే బాగుంటుంది. ఉదాహరణకు ఓ చెడ్డ అలవాటును ఎవరు చెప్పినా మార్చుకోని వ్యక్తి ప్రేమ వల్ల దానికి దూరంగా జరగవచ్చు. కెరీర్‌లో ఎదగడానికి తనే ప్రేరణగా ఉండవచ్చు. కానీ ఇదే సమయంలో అమ్మాయి తిరస్కరిస్తే జీవితమే లేదనుకుని చెడు వ్యసనాలకు బానిసవుతున్న వారు ఎందరో ఉన్నారు.

-డి. కార్తీక్, ఈసీ ఫైనలియర్ స్టూడెంట్

రెండూ బ్యాలెన్స్ చేసుకోగలగాలి



చదువుకునే వయసులో ప్రేమలో పడడం తప్పేమికాదు. కాకపోతే రెండింటిని బ్యాలెన్స్ చేసుకునే పరిపక్వత ఉండాలి. అదే సమయంలో తల్లిదండ్రులను ఒప్పించే ఏ విషయంలో అయినా ముందడుగు వేయాలి. ఒకరి అభిప్రాయంతో మరొకకు ఏకీభవించాల్సిన అవసరమేమి లేదు. ఎదుటి వారి ఇష్టాయిష్టాలను కూడా గౌరవించాలి

-ఎం. వందన, ఈఐఈ, ఫైనలియర్ విద్యార్థిని

ఆలపాటి గెలుపు కోసం పని చేయండి

● పొన్నూరు కార్యకర్తలతో మాజీమంత్రి దేవినేని

● వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర



గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సమావేశమైన మాజీ మంత్రి దేవినేని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేయాలని పొన్నూరు నియోజకవర్గ క్యాడర్‌కు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపిచ్చారు. ఆలపాటి గెలుపును కాంక్షిస్తూ దేవినేని నేతృత్వంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర అధ్యక్షతన గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో సమన్వయ సమావేశం జరిగింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో వ్యక్తిగతంగా, రాజకీయంగా తనకు ఎదురైన ఇబ్బందులు గురించి క్యాడర్‌కు ఈ సమావేశంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల వివరించారు. అయితే వ్యక్తి కంటే పార్టీ ముఖ్యం అనే అభిప్రాయంతో అభ్యర్థితో సంబంధం లేకుండా మాజీ మంత్రి దేవినేని ఉమ సమన్వయంతో పని చేయాలని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ధూళిపాళ్ళ కుటుంబం పార్టీ నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నరేంద్ర స్పష్టం చేశారు. దేవినేని మాట్లాడుతూ తనకు సోదరుడు లాంటి నరేంద్రకి 30 ఏళ్లుగా మంచి అనుబంధం ఉన్నదని, ఆయన కుటుంబం పార్టీ స్థాపించిన దగ్గర నుంచి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీ క్లిష్ట సమయాల్లో నిలబడి పార్టీ కోసం కష్టపడే నాయకులలో ముందుండే వ్యక్తి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని అన్నారు. ఈ పరిస్థితుల్లో పొన్నూరు నియోజకవర్గంలో ఆలపాటి ఎన్నికల ప్రచారానికి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.



మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన మిర్చి కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ నాయకులు

మిర్చియార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● మంత్రి అచ్చెన్నాయుడుకు మిర్చి కమీషన్ వ్యాపారస్థుల విజ్ఞప్తి

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని మిర్చి కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాది నరేంద్రబాబు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ యార్డు ప్రాంగణంలో పుష్కలంగా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలానే డ్రైనేజీని మెరుగుపరచాలని, స్ప్రింక్లర్లన్నీ పని చేసేలా చూడాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ గుంటూరు మిర్చి యార్డులో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలానే మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులున్నారు.

మొండి బకాయిలపై దాడులు

● కాకానిరోడ్డులో గోల్డెన్ టొబాకో కంపెనీ సీజ్

● మరికొన్నింటిపైనా చర్యలకు నగరపాలక సంస్థ సిద్ధం

● పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంపై జీఎంసీ కమిషనర్ చర్యలు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులపై ఎట్టకేలకు నగర పాలక సంస్థ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. అదే విధంగా పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సిబ్బందిపైనా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొండిబకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీతో పాటు కుళాయి కనెక్షన్ తొలగింపు, విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినా దారికిరాని మొండిబకాయిదారులపై నగర పాలక సంస్థ అధికారులు గురువారం ఏకంగా దాడులకు దిగారు. ఈ క్రమంలో రూ.1.63 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉన్న కాకాని రోడ్డులోని గోల్డెన్ టొబాకో కంపెనీకి గురువారం డిప్యూటీ కమిషనర్ తుమ్మల వెంకటకృష్ణయ్య, ఆర్‌ఐ సాధిక్‌బాష, షేక్ ఖాజావలి, సచివాలయ సిబ్బంది ముకుమ్మడిగా వెళ్లి తాళం వేసి సీజ్ చేశారు. ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

ఏడుగురు కార్యదర్శుల సస్పెన్షన్..

గత వారం రోజుల్లో ఆస్తి పన్నులు వసూళ్లలో సున్నా ఫలితాలు సాధించిన ఏడుగురు అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కమిషనర్ శ్రీనివాసులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా నలుగురు ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆస్తి పన్ను వసూళ్లపై గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరగ్గా సచివాలయాల వారీగా ఉన్న డిమాండ్, గత వారం రోజుల వసూళ్ల వివరాలను కమిషనర్ తెలుసుకున్నారు. ఈ క్రమంలో అడ్మిన్ కార్యదర్శులైన ఎం నాగరాజు(14), డి.జయలక్ష్మి(7), ఎస్‌కేబీ అరుణ్‌కుమార్ (154), జె.పవన్ కుమార్(191), కె.కామేశ్వరరావు(163), షేక్ షబీన(40), జి.రేవంత్ నాగసాయి(60) పన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు గుర్తించిన కమిషనర్ వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వసూళ్లపై పర్యవేక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆర్‌ఐలు ఖాజావలి, కాశయ్య, సుబ్బారావు, నాగరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ అదనపు కమీషనర్‌ను ఆదేశించారు.



కాకాని రోడ్డులో గోల్డెన్ టొబాకో కంపెనీకి తాళాలు వేస్తున్న ఆర్‌ఐ షేక్ ఖాజావలి

వీవీఐటీకి ‘ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్’



ల్యాబ్ ధ్రువపత్రాలను చూపుతున్న అధ్యాపకులు, పక్కన వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక ‘ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్’ (ఐడియా డెవలప్‌మెంట్ ఎవల్యూషన్ అండ్ అప్లికేషన్)ను వీవీఐటీ కళాశాలకు కేటాయించినట్లు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. సాంకేతిక విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాప్రమాణాలు, ఆవిష్కరణలకు చేస్తున్న కృషికి గుర్తింపుగా దేశవ్యాప్తంగా సాంకేతిక విద్యాలయాల్లో ఏఐసీటీఈ 113 ల్యాబ్‌లను ఏర్పాటుచేయనుండగా, అందులో వీవీఐటీ కళాశాల ఒకటని వివరించారు. ఈ ల్యాబ్ కోసం ఏఐసీటీఈ వీవీఐటీ కళాశాలకు రూ.90లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంకేతిక విద్యలో అనుభవపూర్వక అభ్యా సం, వ్యవస్థాపకత, ఆవిష్కరణల రూపకల్పన దిశగా విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ ల్యాబ్స్ ముఖ్యఉద్దేశం అన్నారు. రో బోటిక్స్, 3డీ ప్రింటర్స్, ఐఓటీ కిట్స్ వంటి అధునాతన సాంకేతిక సాధనాలు ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉం టాయన్నారు. ఈ ప్రాజెక్ట్ చీఫ్‌మెంటర్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.వై.భానుమూర్తి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ టి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే..



మాట్లాడుతున్న ఆచార్య మురళీకృష్ణ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే వ్యసనాలకు బానిసలు కాకూడదని కాకినాడ జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో "జాయ్ ఆఫ్ ఇంజనీరింగ్" అనే అంశంపై గురువారం రోజున మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థిగా ఉండాలని, ఎల్లప్పుడు పుస్తకాలు చదవట ం అలవాటు చేసుకోవాలన్నారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె. ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్లకు నిధులు

● 662 ఉన్నత పాఠశాలలకు రూ.13.13 కోట్లు

● ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకం కింద మంజూరు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకంలో ఉన్నత పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కోసం నిధులు విడుదల చేశారు. రాష్ట్రంలోని 662 ఉన్నత పాఠశాలలకు రూ.13.13 కోట్లు కేటాయిస్తూ సమగ్ర శిక్ష ఎస్‌పీడీ ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ప్రతి స్కూల్‌కు రూ.1.50 లక్షలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు రూ.లక్ష కేటాయించారు. మధ్యాహ్న భోజన పథకంలో కూరగాయలు పాఠశాలల్లోనే పండించి వినియోగించేలా కిచెన్ గార్డెన్లు ఈ నిధులతో ఏర్పాటు చేసుకోవాలి. అదేవిధంగా ప్రతి పాఠశాల ప్రాంతంలో కురిసే వర్షపు నీరు, వాడుక నీరు భూమిలో ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఈ పనులను ప్రారంభించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించేలా నిధుల వినియోగానికి ఎస్‌ఎస్‌ఏ అధికారులు విధి విధానాలను వివరిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అంగలకుదురు, కొత్తపేట, కొల్లిపర, నారాకోడూరు, నల్లపాడు, రేవేంద్రపాడు, కాకుమాను, నూతక్కి, సిరిపురం, నంబూరు, పెదనందిపాడు, నిడుబ్రోలు, ప్రత్తిపాడు, ముట్లూరు, రావెల, తాడేపల్లి ఉన్నత పాఠశాలలకు ఫేజ్-1లో ఈ నిధులు మంజూరు అయ్యాయి.

నిధులు వెనక్కి ఇవ్వాలనే ఆదేశాలతో కలకలం

పాఠశాలల్లో అభివృద్ధి కోసం ఉన్న నిధులు వెనక్కి ఇవ్వాలని జిల్లా విద్యాశాఖల కార్యాలయాల నుంచి మౌఖిక ఆదేశాలు ఇవ్వడం పలుచోట్ల గత రెండు రోజులుగా కలకలం రేపుతోంది. వాస్తవానికి ప్రభుత్వం నాడు-నేడు పథకంలో వినియోగించుకోకుండా ఉన్న పాఠశాలల్లో నిధులను వెనక్కి ఇవ్వాలనే ఆదేశించింది. కానీ ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం కింద కేటాయించిన నిధులు కూడా జిల్లా విద్యాశాఖాధికార యంత్రాంగం వెనక్కి ఇవ్వాలనడం, రాత పూర్వక ఆదేశాలు లేకుండానే మాట్లాడటంతో కొంతమంది ప్రధానోపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరి కొంత మంది జిల్లా అధికారులు చెప్పారు కదా అని పీపీఏలు క్రియేట్ చేసి జిల్లా కలెక్టర్ల అకౌంట్‌కు నిధులు వెనక్కి పంపుతున్నారు. దీనిపై ఎస్‌ఎస్‌ఏ, విద్యా శాఖాధికారులు ఓ స్పష్టమైన వైఖరికి రావాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన గార్డెన్

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం పెంచాలి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో జనాభాలో 52 శాతంగా ఉన్న బీసీల సంక్షేమం, అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇచ్చే విధంగా నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. గత ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్లించడంతో బీసీల అభివృద్ధికి గండి పడిందన్నారు. ఆ తప్పులను పునరావృతం చేయకుండా కూటమి ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖ ద్వారా బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, కేటాయించిన నిధులన్నింటినీ ఏడాదిలోపే ఖర్చుయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీలకు మూడు రోజుల శిక్షణ

మంగళగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పోషణ్‌బీ - పఢాయిబీ కింద అంగన్‌వాడీలకు మూడు రోజులపాటు జరుగనున్న శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కాజ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో సులోచన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 40 మంది అంగన్‌వాడీ టీచర్లను గ్రూపులుగా విభజించి ఆరుచోట్ల తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, వేణుకుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అవరోధం కలిగిస్తే ఉపేక్షించం : రూరల్ ఎస్ఐ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అవరోధం కలిగిస్తే ఉపేక్షించేది లేదని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. ఆత్మకూరు జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఆయన ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. చిరువ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారులు రోడ్డు మార్జిన్ దిగువన తోపుడు బండ్లు, బుట్టలు పెట్టి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అవరోధం కలిగించకుండా సహకరించాలని కోరారు.

పశు గణన సర్వే తనిఖీ



మేకలు, గొర్రెల యజమానులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి షేక్ పీర్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశు గణన సర్వేపై మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, ఎర్రగుంట్లపాడు, తక్కెళ్ళపాడు, శిరంగిపాలెం, 113 తాళ్ళూరు గ్రామాల్లో తనిఖీ చేశామని మండల పశు వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్ గురువారం తెలిపారు. క్షేత్ర స్థాయిలో పశుగణన చేస్తున్న పశువైద్య సిబ్బంది వాస్తవ గణాంకాలు ఇంటింటికి తిరిగి నమోదు చేసి ఆయా గృహాల్లో ఉన్న ఆవులు, గేదెలు, జీవాలు, కోళ్ళు, కుక్కలు, పందులు, గుర్రాలు, పిల్లులు, ఇతర జంతువులను రికార్డు చేసి వాటిని ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వే దేశంలో ఫిబ్రవరి నెలాఖరుకు ముగియనున్నదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్పీ పరిశీలన



ఫిరంగిపురం పోలీసుస్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం పోలీసు స్టేషన్‌ను గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. అంతేగాక స్టేషన్ పరిసర ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

పరీక్షల కోసం ఆందోళన వద్దు

● ఎంఈవో కెన్నడీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవోలు కెన్నడీ, విజయభాస్కర్‌రావు

కాకుమాను, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈవో కెన్నడీ అన్నారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పరీక్షలకు హాజరవ్వాలన్నారు. సెల్ఫ్ మోటివేషన్ ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎంఈవో-2 విజయ్‌భాస్కరరావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్య ద్వారా ఉత్తమ జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలి

● కూటమి నాయకులు



ఉండవల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నేతలు



ఎర్రబాలెంలో ప్రచారం చేస్తున్న జయసత్య తదితరులు

తాడేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం ఉండవల్లిలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నేతల గెలుపుతోనే సమ స్యల పరిష్కారం జరుగుతుందని ఆలపాటిని గెలి పించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓట్లు అభ్యర్థించా రు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగుయువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్య క్షుడు జంగాల వెంకటేష్, జనసేన నేత జొన్నా రాజేష్, దొప్పలపూడి జ్యోతిబసు, దాసరి కృష్ణ, గాదె వినయ్, రాయపూడి కిరణ్, గాదె బసివిరెడ్డి, సిగిరి శెట్టి లీలాకృష్ణ, కూనపరెడ్డి రమేష్, బొబ్బా రవితేజ, ఉదయ్ ప్రశాంత్, చాముండేశ్వరి, ప్రదీప్, మోషే తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణంలో..

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, ముమ్మడి సత్యనారాయణ, టీడీపీ నేతలు ఇట్టా భాస్కర్, గాజుల కృష్ణ, పోతాబత్తిన శ్రీనివాసరావు, గాదె సాంబశివరావు, పుష్పలత, హనుమంతు, పుష్పాంజలి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో..

మంగళగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఎర్రబాలెం గ్రామంలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎర్రబాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు నీలం అంకారావు, అప్పల శాంతి, యల మంచిలి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గ గొంతుక లక్ష్మణరావు

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ



పట్టభద్రులను కలిసి ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

తాడేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ఉండవల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం రాత్రి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రాజధాని ప్రజాసంఘాల బాధ్యుల సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ 14 సంవత్సరాల పాటు ఎమ్మెల్సీగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం, అన్ని వర్గాల సమస్యలపై అవగాహన ఉన్న కేఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి, భాగ్యరాజు, నవీన్‌ప్రకాష్, రామరాజు బక్కిరెడ్డి, ఇమ్మానుయేలు రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త లక్ష్మణరావును గెలిపించండి

తాడేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని కుంచనపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్, సీపీఎం రూరల్ మాజీ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ప్రచారం నిర్వహించారు. ఆయనను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, నల్లపు కిషోర్, కాజ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మద్దతుగా..

మంగళగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం యూటీఎఫ్, ప్రజా సంఘాల నేతలు గురువారం ఎర్రబాలెం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ప్రజాసంఘాల నేతలు వీరవెంకయ్య, రవి, రాధిక, అరుణ్, ఆంథోని, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపూడిలో..

దుగ్గిరాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలగ్రామం తుమ్మపూడిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వ్యవసాయకార్మికసంఘ జిల్లాకార్యదర్శి జెట్టి బాలరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి గొరైపాటి శ్రీనివాసరావు, కౌలురైతుసంఘ అధ్యక్షుడు బీమవరపు అమ్మిరెడ్డి, నడకుదురు యోగేశ్వరరావు, చొక్కాకుల శ్రీనివాసరావు, పజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవీరమ్మ పేరంటాళ్లు, శ్రీచింతయ్యస్వామి తిరునాళ్ల

వైభవంగా సిడిమాను గ్రామోత్సవం



వీరమ్మ పేరంటాలు, శ్రీచింతయ్య స్వామి



పెనుమూలిలో సిడిమాను ఉత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏటా మాఘ మాసంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శ్రీవీరమ్మ పేరంటాలు, శ్రీచింతయ్య స్వామి కల్యాణోత్సవం, పసుపుబండ్ల ఊరేగింపు, సిడిమాను ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. మండలంలోని పెనుమూలిలో మూడ్రోజుల పాటు జరిగే తిరునాళ్లలో ముగింపు కార్యక్రమంలో భాగంగా. శ్రీడిల్లీ పోలేశమ్మ ఆలయం నుంచి సిడిమాను గ్రామోత్సవం నిర్వహించారు. తాడు కట్టుకుని భుజంపై సిడిమానును మోస్తూ మేకపోతు వేలాడుతుండగా గ్రామంలో కన్నుల పండువగా సిడిమాను ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలలా ఉన్న పెనుమూలి, పరిసర గ్రామ ఆడపడుచులు, పలువురు గ్రామస్థులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. గ్రామంలో లైబ్రరీ ఆవరణ నుంచి నంబూరు, కేఆర్ కొండూరు రోడ్డు వరకూ దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ఆలయ పరిసరాలు విద్యుద్దీపాలంకరణతో కళకళలాడాయి. గతేడాది తాము కోరుకున్న కోర్కెలు తీరిన భక్తులు ఆలయం ఎదుట ఓబుట్టలో కూర్చుని సిడిమాను పైకిలేవనెత్తగా భక్తులు అమ్మవారిని స్తుతిస్తూ, మేళతాళాల మధ్య తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొలతల ప్రకారం పనిచేస్తే కూలి రూ.300

● డ్వామా పీడీ శంకర్



తిక్కిరెడ్డిపాలెంలో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శంకర్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారం పనిచేస్తే ప్రతి వ్యక్తికి మూడు వందల రూపాయల కూలి సొమ్ము వస్తుందని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. తిక్కిరెడ్డిపాలెంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరు సమయానికి వచ్చి మీకు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న పనుల గురించి మండలాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువుల షెడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శివన్నారాయణ, ఏపీవో ఏడుకొండలు, ఈసీ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలి

పెదనందిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉపాధిహామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని, పొలాలకు వెళ్లే డొంకలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతిపాదనల మేరకు ఆయా పంచాయతీల్లో పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వ్యవసాయ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లాల పోలీసు చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏపీవో సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే : జేసీ భార్గవతేజ



పాండ్రపాడులో రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ

కాకుమాను(పాండ్రపాడు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యో తి): రైతు సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీసర్వే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ భార్గవతేజ అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా మండలపరిధిలోని పాండ్రపాడు భూముల రీసర్వే కోసం ఎంపిక చేశారు. రీసర్వేలో భాగంగా గురువారం జాయింట్ కలెక్టర్ గ్రామానికి వచ్చారు. గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో 823.75 ఎకరాలు సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి జేసీ భార్గవతేజకు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించే విధానాన్ని అధికారులకు తెలియజేశారు. రీసర్వే ప్రక్రియను ఈ నెల 20 నుంచి ప్రారంభించాలని రెవెన్యూ, సర్వేయర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వోలు, సచివాయల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో ప్రజల ఆరోగ్యానికి ముప్పు

మంగళగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి కేఎల్ డీమ్డ్ యూని వర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్టెన్షన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో గురువారం జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలపై మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సీఈఏ విద్యార్థులు గ్రామంలో ప్రదర్శనగా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, శరీరం లో కొవ్వు శాతం ఎక్కువగా పేరుకుపోతుందని తెలిపారు. తద్వారా కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతోపాటు అధికంగా బరువు పెరిగి జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుందని వివరించారు. చిన్న వయస్సులోనే కేన్సర్ వంటి ప్రాణాం తక వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు. కార్యక్రమంలో సీఈఏ కోఆర్డినే టర్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ ప్రగల్భాలు జనవంచనే : కొల్లా

కాకుమాను, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జగన్ తన ఐదేళ్ల పాలన గురించి గొప్పగా చెప్పడం జనవంచనే అవుతుందని సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి ఆరోపించారు. చంద్రబాబునాయుడుపై అవాకులు, చెవాకులు పేలడం మానుకోవాలని హితువు పలికారు. వేల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేసి 16నెలలు జైలు జీవితం గడిపిన జగన్ రాష్ట్రాన్ని పరిపాలించడం రాష్ట్రానికి శాపంగా మారిందని అన్నారు.

రేషన్ దుకాణంపై 6ఏ కేసు



రేషన్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ శివశంకర్

పెదనందిపాడు(అన్నపర్రు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రులో డీలర్ గుంటూరు వెంకటరత్నంకు చెందిన 3వ నెంబరు రేషన్ దుకాణాన్ని గురువారం పౌరసరఫరాలశాఖ డీటీ శివశంకర్, రెవెన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలోని రికార్డులు, రేషన్ బియ్యం నిల్వలను పరిశీలించగా 25.15క్వింటాల్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై 6ఏ కేసు నమోదు చేసి, దుకాణాన్ని సీజ్ చేశారు. మిగిలిన స్టాకును 4వ నెంబరు దుకాణానికి తరలించినట్లు డీటీ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ సాహితీమోహన్, వీఆర్వో శ్రావణ్ ఉన్నారు.

స్థానిక, బయట కార్మికులను గుర్తించాలి

- సీఆర్‌డీఏ డీడీ శ్రీనివాసరావు

తుళ్లూరు, ఫిబ్రవరి 13:(ఆంధ్రజ్యోతి) త్వరలో రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, పలు కంపెనీల కింద వేల సంఖ్యలో కార్మికులు వస్తారని, మొత్తం కార్మికులలో స్థానికులు ఎవరు, బయట వారు ఎవరనేది గుర్తించాలని సీఆర్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ బొర్రా శ్రీనివాసరావు అన్నారు. గురువారం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో డ్వాక్రా గ్రూపులకు చెందిన జెండర్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పనులకు వచ్చే కార్మికులలో మహిళలు కూడా ఉంటారని, స్థానిక మహిళలు, బయట ప్రాంత మహిళలను గుర్తించి వారికున్న సమస్యలను జెండర్ కమిటీలు గుర్తించాలన్నారు. సమావేశంలో వెలుగు సీసీలు, ఏపీఎం, పీడీ, యానిమేటర్స్ జెండర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

బాల్య వివాహాలు అనర్ధదాయకం

● ఎంఈవో సత్యనారాయణమూర్తి

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, ఈ వివాహాలు చేసిన వారితో పాటు ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులవుతారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఎంఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. వట్టిచెరుకూరులోని జడ్పీ హైస్కూల్లో గురువారం బాల్య వివాహ వ్యతిరేక ప్రచార ఉద్యమ కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏపీని డ్రోన్ కేపిటల్‌గా అభివృద్ధి చేస్తాం

● డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీని డ్రోన్ కేపిటల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.దినేష్ కుమార్ చెప్పారు. ఇప్పటికే ఓర్వకల్లులో డ్రోన్ సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 300 ఎకరాలను కేటాయించిందని, డ్రోన్స్ తయారీ కంపెనీల నుంచి నూతన సృజనలను ఆహ్వానించి భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా డ్రోన్ల ద్వారా సేవలను విస్తృత పరచనున్నామని వెల్లడించారు. మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్‌ఎం యూనివర్సిటీని గురువారం ఆయన సందర్శించారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన వివిధ రకాల డ్రోన్ టెక్నాలజీలను పరిశీలించి, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్లను అందుబాటులోకి తెచ్చిన వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో మాట్లాడారు. ఎస్ఆర్‌ఎం విద్యార్థి మణికంఠ ప్రదర్శించిన వైద్య పరికరాలు, మందుల సరఫరా డ్రోన్ పనితీరును పరిశీలించి అభినందించారు. డ్రోన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని యూనివర్సిటీ సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రవితేజ, డ్రోన్ టెక్నాలజీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రజన్‌లు ఎండీ దినేష్‌కుమార్‌ను కోరారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, డ్రోన్ కార్పొరేషన్ బృందం పాల్గొన్నారు. తొలుత దినేష్‌కుమార్ ఎస్ఆర్‌ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్‌ను కలిసి వివరాలను తెలుసుకున్నారు.

తులసి సీడ్స్‌లో సందర్శనకు కేఎల్‌యూ విద్యార్థులు



తులసీ సీడ్స్ ఫ్యాక్టరీని సందర్శించిన కేఎల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కేఎల్ వ్యవసాయ కళాశాల నుంచి అగ్రికల్చరల్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న 170మంది విద్యార్థులు విజ్ఞాన సందర్శనలో భాగంగా గురువారం ఫిరంగిపురంలోని తులసి సీడ్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. విద్యార్థులు సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్, ప్యాకింగ్ సెక్షన్, బయో టెక్నాలజీ ల్యాబ్, గ్రీన్ హౌస్ వంటి ఇతర విభాగాలను పరిశీలించారు. తులసి సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్, ఆర్అండ్‌డీ శాస్త్రవేత్తలు విద్యార్థులకు సహకరించి హైబ్రిడ్ విత్తనోత్పత్తి, సీడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ తదితర విషయాలను గురించి క్షుణ్ణంగా వివరించారు. కేఎల్ వ్యవసాయ కళాశాల తరపున జన్యుశాస్త్రం, మొక్కల పెంపకం విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సుష్మారాజ్ చెల్లెం, జి.సాయి వంశీరెడ్డి, కావూరి కల్పన, అసోసియేట్ ప్రొఫెసర్ (పాథాలజీ) డాక్టర్ పి.సెంథిల్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ విజ్ఞాన సందర్శనకు అనుమతించిన తులసి సీడ్స్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్‌చంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘన వ్యర్థ పదార్థాల షెడ్డులో డీపీవో తనిఖీ



డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో బీ సాయికుమార్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో నిర్మించిన ఘన వ్యర్థ పదార్థాల షెడ్డును గుంటూరు జిల్లా పంచాయతీల అధికారి బీ సాయికుమార్ గురువారం పరిశీలించారు. తనిఖీలపై ఈవో ఏ కిషోర్‌బాబును ప్రశ్నించగా వానపాములు వేశామని, 40 రోజుల్లో వర్మి కంపోస్టు తయారవుతుందని చెప్పగా ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో డబ్ల్యూపీసీ షెడ్లలో కూడా ఇదేవిధంగా వర్మిని తయారు చేయాలని ఆయన ఈవోపీఆర్‌డీ సీహెచ్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. అనంతరం ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్ళను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ నిర్మాణానికి తొలి అడుగు

త్వరలో శంకుస్థాపన



పీహెచ్‌సీ సెంటర్లో క్యాన్సర్ స్క్రీ నింగ్ సెంటర్ నిర్మాణానికి భూమిని చదును చేస్తున్న ఎక్స్‌లేటర్

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో క్యాన్సర్ స్క్రీ నింగ్ యూనిట్ నిర్మాణానికి గురువారం అంకురార్పణగా శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆరోగ్య కేంద్రం ఆవరణలో ముళ్ళ పొదలు, గతంలో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణానికి అనువుగా స్థలాన్ని ఎక్స్‌లేటర్‌తో చదును చేశారు. పత్తిపాడు నియోజకవర్గంలో ప్రజానీకానికి అందుబాటులో క్యాన్సర్ మహమ్మారిని తొలిదశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ యూనిట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యూనిట్ నిర్మాణానికి గతంలోనే మంజూరుకు అనుమతులు లభించగా స్థల ప్రభావంతో వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం నిబంధనలకు అనుగుణంగా పీహెచ్‌సీ ఆవరణలో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. త్వరలోనే భూమి పూజ చేయనున్నారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో అన్ని వసతులతో యూనిట్ బిల్డింగ్ నిర్మాణం జరగనున్నదని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మెర్సి వివరించారు.

పిల్లల్లో మానసిక వికాసానికి అంగన్వాడీలు కృషిచేయాలి

● ఎంపీడీవో శ్రీనివాసరావు

దుగ్గిరాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లోని 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోషక విలువలున్న ఆహారాన్ని అందించడమే కాకుండా వారి మానసిక స్థితిగతులను మెరుగుపరచేందుకు నిరంతరం కృషి చేయాలని ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు అన్నారు. మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ.. పఢాయిబీపై దుగ్గిరాల, రేవేంద్రపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న మూడ్రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవానీ, శ్రీవాణిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి కుటుంబంలో ఉన్న పరిస్థితులను సైతం అర్థం చేసుకుని, పిల్లలపై వారి ప్రభావం ఏమేరకు ఉందో గమనించాలని, అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న సమయంలోనూ వారి ప్రవర్తనను అనుసరించి మానసికోల్లాసంతో ఉండేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్ భవాని పలు అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు.

పోషక ఆహారం లోపిస్తే అనారోగ్యం

తుళ్లూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రరజ్యోతి): పోషక ఆహారం లోపిస్తే అనారోగ్యం బారిన పడాల్సి ఉంటుందని తుళ్లూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పోషణ్ బీ -పఢాయి బీ శిక్షణ కార్యక్రమం జరిగింది. తుళ్లూరు కేవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోకాహారం ఆవశ్యకత గురించి, వివరించారు.

ఘనంగా ఉయ్యూరు వీరమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ల

పెదకాకాని, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని ఉయ్యూరు వీరమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తిరునాళ్లలో పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపించారు. తిరునాళ్ల మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. వారం రోజులుగా పేరంటాలమ్మ అమ్మవారు వెనిగండ్ల, అగతారపాడు, తక్కెళ్ళపాడు, పెదకాకాని గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక వాహనంలో ఊరేగి, గ్రామాల్లో నిద్రించి, తిరిగి పెదకాకాని ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి తిరునాళ్ల మహోత్సవాన్ని జరిపించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

క్రైమ్ జోన్

వివాహిత ఆత్మహత్య

తెనాలి క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక రామలింగేశ్వర పేట, తోటవారి వీధిలో జరిగింది. ఎస్‌ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగేశ్వరపేటకు చెందిన ముత్యాల శ్రీనివాసు, ఇందిరారాణి (34) 16 సంవత్సరాల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. మార్కెట్ ఏరియాలో చిన్న దుకాణం పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. గత కొంతకాలంగా వ్యాపారం సరిగ్గా సాగక ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో బుధవారం సాయంత్రం భర్త షాపునకు, పిల్లలు ట్యూషన్‌కు వెళ్లిన సమయంలో తలుపులు వేసుకుని వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ట్యూషన్ నుంచి వచ్చిన పిల్లలు తల్లి మృతి చెంది ఉండటాన్ని గుర్తించి, తండ్రికి, స్థానికులకు చెప్పగా వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి ఆమె చెందింది. గురువారం మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

చేబ్రోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాకోడూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పి.మహేష్ అనే బాలుడు సీఎంఎస్ హాస్టల్లో ఉంటూ స్థానిక ప్రైమరీ స్కూల్లో 3వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది సంఘటనలో బాలుడి కాలు విరిగింది. బాలుడిని 108 వాహనంలో వడ్లమూడిలోని ప్రైవేటు హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. బాలుడు అనాథ అని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగ పేటకు చెందిన ఎం.మధు (50) బుధవారం రాత్రి పనుల నిమిత్తం చెంచుపేట ఓవర్ బ్రిడ్జిపై నడిచివెళ్తున్న సమయంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో అతను రోడ్డుపై ముందుకు పడి గాయాలపాలయ్యాడు. జిల్లా వైద్యశాలలో చికిత్సపొంది గురువారం మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు కేంద్రం విశిష్ట గుర్తింపు సంఖ్య : ఏడీఏ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తుందని ఏడీఏ వీ రామకోటేశ్వరి గురువారం తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు యూనిక్ ఐడీ అందించనున్నట్లు చెప్పారు. సొంత భూమి ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే వివిధ పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పెట్టుబడులు, పంటల బీమా పథకం, కనీస మద్దతు ధర పంట, వ్యవసాయ రుణాలు, అనుబంధ రంగ సేవలను పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో 14 అంకెల విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం లేదా వన్‌బీ, ఆధార్ జిరాక్స్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకొని రైతు సేవ కేంద్రంలో ఈ ఫార్మర్ రిజిస్ట్రీని చేసుకోవాలని సూచించారు.

'పారా లీగల్ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి'

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవా కేంద్రం చైర్మన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏ పవన్ కుమార్ గురువారం తెలిపారు. అభ్యర్థులు పదో తగతి ఉత్తీర్ణులై సమాజంలోని అట్టడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. ఫిబ్రవరి 21వ తేదీ లోపు దరఖాస్తులను మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

● తెనాలి క్రైం: సేవాభావం కలిగి ప్రజలకు న్యాయ సేవా సంస్థ మధ్య వారధిగా స్వచ్ఛందంగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపికైన అభ్యర్థులకు న్యాయ వ్యవస్థపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 19లోపు తెనాలి కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార కార్యాలయంలో పోస్టు ద్వారా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని న్యాయాధికారి కోరారు.

అధ్వాన రహదారితో ఇక్కట్లు



అంగలకుదురు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

- గతుకులమయంగా జిల్లా వైద్యశాలకు వచ్చే రోడ్డు
- నిత్యం వందలాది మంది రోగులు రాకపోకలు
- ప్రధాన రహదారిదీ అదే దుస్థితి
- మరమ్మతులు చేపట్టాలంటూ ప్రజల వినతి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రెండో అతిపెద్ద వైద్యశాలగా తెనాలి జిల్లా వైద్యశాల పేరుగాంచింది. నిత్యం వైద్యశాలకు వందలాదిమంది రోగులు వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం రాకపోకలు సాగిస్తుంటారు. తెనాలి బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ రోడ్డు మార్కెట్ యార్డు రోడ్డు నుంచి జిల్లా వైద్యశాలకు వెళ్లాల్సిఉంది. ఈ క్రమంలో ఆయారోడ్లు గుంతలమయంగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అధ్వాన రహదారి మరమ్మతులకు నోచుకొనేదెప్పటికో అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెనాలి నుంచి జిల్లా వైద్యశాలకు వచ్చే మార్గం చెంచుపేట సుల్తానాబాదు ప్రధాన రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. నంగం జాగర్లమూడి-అంగలకుదురు రహదారిపై వేసిన తారు చిప్స్ డస్ట్ వేరై గుంతలమయంగా మారింది. ఆర్ సీఎం చర్చ్ నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళే రోడ్డు కూడా గుంతలమయమై రోగులను తరలించే క్రమంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా 108 వాహనంలో ఆక్సిజన్‌ను రోగులకు అమర్చి ఆసుపత్రికి తీసుకువచ్చే క్రమంలో అధ్వానంగా ఉన్న రోడ్లతో కుదుపులకు గురై ఆ రోగుల బాధలు వర్ణనాతీతం. సకాలంలో వైద్యశాలకు చేరాలన్నా రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆలస్యమవుతోందని రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఎంతోమంది రోగులు వారి సహాయకులు రాకపోకలు చేసే ఈ రోడ్లపై ప్రభుత్వం దృష్టి పెట్టి మరమ్మతులు చేపట్టి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే రోడ్డు

స్వచ్ఛతా దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. గురువారం మార్కెట్ సెంటర్ లోని పురపాలక సంఘ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్న సోర్స్ - రిసోర్స్ కరపత్రాన్ని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ నెల మూడో శనివారం సోర్స్ - రిసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇంటినుంచి, షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరుచేసి మూడు బుట్టల ద్వారా పారిశుధ్య కార్మికులకు అందించడం, హోమ్ కంపోస్ట్ విధానాన్ని పాటిస్తూ పురపాలక సంఘంతో చేయిచేయి కలపాలన్నారు. సుందర తెనాలి సాధనలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, మేనేజర్ చండి దేవసేన, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించండి

- నియోజవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బీటీ నాయుడు
- ఆలపాటితో కలిసి ఎన్నికల ప్రచారం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వం అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజార్టీతో గెలిపించాలని తెనాలి నియోజవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు ఆదోని ఎమ్మెల్సీ బీటీ నాయుడు కోరారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కే కరిముల్లా, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి ఆయన పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ఉద్యోగులను, చినరావూరులోని సత్యనారాయణ పార్క్, రజక చెరువు వద్ద ఐలమ్మ పార్క్, ఇండోర్ స్టేడియంలలో పలువురు వాకర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక యువతలో నిరాశ నెలకొందని ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు చవిచూశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యువతకు, ఉద్యోగులకు భవిష్యత్‌పై ఆశలు చిగురించాయన్నారు. యువత కష్టాలు తెలిసిన వ్యక్తి, ఉద్యోగులకు అండగా నిలిచే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించుకుందామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు రాష్ట్రంలో గతి తప్పిన వ్యవస్థలను తిరిగి గాడిలో పెడుతూ అన్ని రంగాలను అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఉద్యోగులకు భరోసాగా ఉంటూ పాలన సాగిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తొలిగా జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచికి ప్రాధాన్యమిస్తూ కృష్ణ, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేసే తనకు తొలిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటు అభ్యర్థిస్తున్న బీటీ నాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

మార్చి నుంచి నూతన మోటారు వాహన చట్టం

● రవాణా అధికారి రాఘవరావు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటారు వాహన చట్టాలను తరుచూ ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతోపాటు జరిమానాలు విధించడం జరుగుతుందని రవాణా శాఖ అధికారి వి.రాఘవరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక రవాణా శాఖ కార్యాలయం వద్ద భారీ వాహనాలు, లారీల యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన మోటారు వాహన చట్టం ప్రకారం... డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.10వేలు జరిమానా విధించడం, 90రోజుల లోపు జరిమానా కట్టకపోతే సదరు వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు, రవాణా అధికారులపై వాగ్వివాదానికి దిగితే వాహనానికి సంబంధించిన సమాచారం ఇవ్వటానికి నిరాకరించిన కేసు నమోదు చేయడం జరుగుతుంది. మద్యం తాగి వాహనాన్ని నడిపితే రూ.10 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బస్సు, లారీ, భారీ వాహనాదారులు తప్పనిసరిగా పర్మిట్, ఆర్‌సీ, ఎంసీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, టాక్స్ రిసీట్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. నూతన మోటారు వాహన చట్టం ప్రకారం ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసినా చట్ట నిబంధనలు పాటించకపోయినా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని రవాణా శాఖ అధికారి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ లారీ, ప్రైవేట్ బస్సు, భారీ వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



గుండె జబ్బులపై అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారులు

సీహెచ్‌సీల్లో గుండెపోటుకు ఇంజెక్షన్లు

● మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణి

కొల్లిపర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంట అత్యంత కీలకమని, వారికి ఇంజెక్షన్లు సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పొన్నం శ్రావణి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెకు భరోసా సదస్సును వైద్యాధికారులు నిర్వహించారు. రోగులకు గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఇన్‌చార్జి శ్రావణి మాట్లాడుతూ ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగటం, గుండె జబ్బు లక్షణంగా గ్రహించవచ్చన్నారు. ఆకస్మికంగా ఆయాసం, గుండెదడ, స్పృహతప్పి పడిపోవటం గుండెపోటు లక్షణాలు అన్నారు. వెంటనే 108కి ఫోన్‌చేసి దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆ పేషెంట్‌ని తీసుకెళ్ళాలన్నారు. ఆ సమయంలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి గుండెపోటు అయితే వెంటనే రూ.45వేలు విలువ గలిగిన టెనెక్టె ప్లస్ అనే ఇంజక్షన్‌ను చేయడం వలన ఆ రోగిని కాపాడుకోవచ్చునన్నారు. వైద్యాధికారి సుప్రియా చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో టెనెక్టెప్లస్ ఇంక్షన్ రూ.45లు విలువగలది ఉచితంగా ఇస్తున్నట్లు తెలియజేశారు. మండలంలోని గ్రామాల ప్రజలు ఈ వైద్య సదుపాయాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. సదస్సులో వైద్యాధికారులు కె.కావ్య, పి.స్వప్న, పి.మణికంఠ, జి.గంగాధర్‌రావు, జి.అనూష, రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ దేవేంద్రనాథ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ, అనిల్ కుమార్ తదితరులు

డాక్టర్ దేవేంద్రనాథ్‌కు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని డాక్టర్ వుళ్లక్కి మెమోరియల్ ఐఎంఏ హాల్‌లో గురువారం ఈ నెల 12వ తేదీన మృతి చెందిన డాక్టర్ వి.దేవేంద్రనాథ్‌కు ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె డాక్టర్ దేవేంద్రనాథ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యకుడు డాక్టర్ అనిల్ కుమార్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, వైద్యులు లక్ష్మీప్రసాద్, జేవీ సుబ్బారావు, జి.సాంబశివరావు, కె.పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసులు ఘంటసాల వర్థంతి గురువారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ సంగీత జగతిలో ఆయన సంగీత వైభవాన్ని వక్తలు నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, విజయదుర్గా, విజయలక్ష్మి వివరించారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీచక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలు ఘనంగా జరిపారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, నాగమారుతీ బృందం వైఖానస ఆగమ రీతిలో క్రతువు నిర్వహించారు. శుక్రవారం పుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. నిఖిల్ శాండిల్య, బాలకృష్ణ, శ్రీనివాసరావు, సురేష్, వెంకటేశ్వరరావు, అనురాధ పాల్గొన్నారు.



చక్కెర స్నాన పూజలు చేస్తున్న అర్చకులు

నేడు హరికథా గానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వయోలిన్ విద్వాంసులు కూరపాటి యలమందరాజు సంస్మరణ ఉత్సవం శుక్రవారం జరుగుతుంది. గాంధీచౌక్‌లోని గోవర్ధనస్వామి ఆలయంలో హరికథా గానం ఏర్పాటు చేశామని సుబ్రహ్మణ్య రాజు, కేవీ రామకృష్ణ, పూర్ణవల్లి తెలిపారు.



రీ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తదితరులు

సర్వేను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూమి రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా యజమానులు సంతృప్తి చెందేలా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ అన్నారు. రీ సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండల పరిధిలోని మంచాలలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని గురువారం జేసీ భార్గవ్‌తేజ తనిఖీచేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి రీ సర్వే జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పటం, ఓఆర్‌ఐ షీట్లను పరిశీలించారు. గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుకు వచ్చిన అర్జీలను పరిష్కరించే విధానాన్ని పరిశీలించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గాలు ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేట సీఎం కాలనీకి చెందిన షేక్ ఆయేషా (29) గత నెల 31వ తేదీన కుటుంబ సభ్యులకు బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తెలిసిన వారిని బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీనితో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. గురువారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దాడి సంఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. వన్ టౌన్ ఎస్‌ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు స్థానిక వహాబ్‌రోడ్డులో గొండి బసవేశ్వరరావు (53) ఆటోలు అద్దెకు ఇస్తుంటాడు. గత నెల 31న రాత్రి ఇతని వద్ద ఆటోలు అద్దెకు తీసుకుని నడుపుకునే ఆటోడ్రైవర్లు రాము, అనీల్, వేణులు ఆర్థిక లావాదేవీలలో తేడా రావడంతో బసవేశ్వరరావుపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి 9 గంటల సమయంలో మృతి చెందాడు. దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసి ఇప్పటికే జైలుకు తరలించారు.

ఆశ్రమానికి రూ.లక్ష విరాళం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆశ్రమ నిర్మాణ స్థలానికి రూ.లక్ష విరాళం అందించారు. గద్దె పిచ్చయ్య స్మారకార్థం ఆయన సతీమణి సీతామహాలక్ష్మి నగదును గురువారం నరేంద్ర రామానుజ దాసస్వామికి అందజేశారు. విరాళాన్ని అందించిన ఆమెకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం అందజేస్తున్న సీతామహాలక్ష్మి

కొనసాగుతున్న సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సదరం సర్టిఫికేట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ రెండో రోజు గురువారం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరి వైకల్యశాతం వివరాలను వైద్యులు నమోదు చేసుకున్నారు. సచివాలయ సిబ్బంది, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



సదరం రీ వెరిఫికేషన్ వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

శలపాడు చెరువును అభివృద్ధి చేయాలి

● గ్రామస్థుల విజ్ఞప్తి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులో చెరువును అభివృద్ధి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. మాజీ సైనికోద్యోగి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఈ ఫిర్యాదును అందజేశారు. గ్రామంలో చెరువు చుట్టూ మూడువైపులా సిమెంట్ రోడ్డు నిర్మించారన్నారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహం వెనుక వైపు ఉన్న చెరువు కట్టను కూడా బాగుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి వైపు నుంచి గ్రామస్థులు రైతులు పంట పొలాలకు రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు. ఈ రహదారిపై ఉన్న చెత్త చెదారాలను తొలగించడంతోపాటు పిచ్చి చెట్లను తొలగించి రహదారి నిర్మాణం చేయడం ద్వారా చెరువు అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి చెరువు అభివృద్ధికి సహకరించాలని కోరారు.



శలపాడు గ్రామ చెరువును చూపుతున్న మాజీ సైనిక ఉద్యోగి మల్లేశ్వరరావు

కార్మికులు పేర్లు నమోదు చేయించుకోవాలి

● లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ సుభాని

కొల్లిపర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెనాలి లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ సుభానీ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో ఈ శ్రమ కార్డ్స్ రిజిస్ట్రేషన్‌పై యానిమేటర్లకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు రూ.110లతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందటానికి అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవటానికి ఆధార్‌కార్డును, బ్యాంకు అకౌంట్ పుస్తకాన్ని తీసుకెళ్ళాలన్నారు. యానిమేటర్లు ఈ విషయాన్ని మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు తెలియజేయాలన్నారు. సదస్సులో సీసీలు విజయ కుమార్, మధు, ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ సుభాని